PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 47 | విజయవాడ, బుధవారం 17 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 17 September 2025 | Rs

విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

- రణభేరి జాతాలో యుటిఎఫ్ డిమాండ్
- రాజవొమ్మంగిలో జాతాను అడ్డుకున్న పోలీసులు

3

గొర్రెల మేతగా ఉల్లి

- ధర లేదని 4.5 ఎకరాల్లో పంట వదిలేసిన రైతు

3

'ఎరువు' రాయితీ ఎలా?

సిఎం ప్రకటనపై సందేహాలెన్నో..

- రైతుల ఆందోళనల వేడి చల్లార్చేందుకేనన్న వాదన
- వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకేనన్న విమర్శలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

యూరియా సహా అన్ని రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులకు నగదు ప్రోత్సాహకం అందజేస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఎరువులకు కేంద్రం విధించిన కోతలు, ఎరువుల సరఫరాలో ప్రభుత్వ వైఫల్యాలపై అన్నదాతల్లో నెలకొన్న ఆగ్రహావేశాలు, అసంతృప్తులను తగ్గించడానికి, ప్రస్తుతం నెలకొన్న వేడిని చల్లార్చడానికే సిఎం ఆ ప్రకటన చేశారని తెలుస్తోంది. రైతు ఎంతైతే ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తాడో, ఆ మేరకు బస్తాకు రూ.800 వంతున నగదు బదిలీ చేయనున్నట్లు సోమవారంనాటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. దానికి సంబంధించి త్వరలో విధి, విధానాలు రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కాగా సిఎం ప్రకటన వెనుక ఎలాంటి నిర్దిష్ట కసరత్తు చేయలేదని, ప్రభుత్వంలో ప్రాథమిక స్థాయిలో కూడా చర్చ జరగలేదని సమాచారం. అందుకే ఏ ఎరువు వాడకాన్ని తగ్గిస్తే రూ.800 ఇస్తారో స్పష్టత కరువైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఫోకస్ అంతా యూరియాపైనే ఉంది. యూరియా సరఫరాలో ప్రణాళికా రహితంగా ఉన్నారంటూ ప్రభుత్వ వైఫల్యాన్ని సిఎం ఒక మేరకు అంగీకరించారు. యూరియాకే ఎక్కువ సమస్య ఏర్పడింది. కేంద్రం నుంచి అదనుకు యూరియా సరఫరా కానందువల్లనే కొరత వచ్చింది.

పిఎం ప్రణామ్‌లో భాగమే

ఎరువుల సబ్సిడీని తగ్గించుకునేందుకు 2023 జూన్‌లో మోడీ సర్కార్ 'పిఎం-ప్రణామ్' స్కీంకు రూపకల్పన చేసింది. అంతకుముందటి మూడేళ్ల ఎరువుల వినియోగం సగటును గణించి, దానిలో కనీసం పది శాతం వినియోగం తగ్గించాలన్నది లక్ష్యం. ఆ విధంగా ఎంతైతే వినియోగం తగ్గించి సబ్సిడీని ఆదా చేస్తారో, ఆ అమౌంట్‌లో సగ భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు గ్రాంట్‌గా ఇస్తామంది.

దేశ వ్యాప్తంగా ఏడాదికి కేంద్రం ఎరువుల సబ్సిడీ రూ.20 వేల కోట్లు తగ్గించుకోవాలన్నది టార్గెట్. 2023-24, 2024-25, 2025-26.. ఈ మూడేళ్లూ పిఎం ప్రణామ్ అమలులో ఉంటుంది. భవిష్యత్తులో కూడా కొనసాగుతుంది. వీలైన మేరకు ఎరువుల వాడకాన్ని తగ్గించి కేంద్రం నుంచి గ్రాంట్ పొందాలని ఎపి పోటీ పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం బయటికి పొక్కేసరికి, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్‌లో కొంత మొత్తాన్ని రైతులకు నగదు బదిలీ చేస్తామంటే రైతుల్లో ఆందోళన, వ్యతిరేకత తగ్గుతుందని కూటమి సర్కార్ ఎత్తు వేసిందని అనుకుంటున్నారు.

బేస్ లేదు

రైతు ఎంత మేర ఎరువుల వాడకాన్ని తగ్గించాడో నిర్ణయించడానికి డేటా, మెకానిజం ప్రశ్నార్థకంగా మారింది. ఏ ప్రాంతంలో ఏ పంటకు ఎంత ఎరువు ఏ ఎరువు వేయాలన్న వ్యవసాయ వర్శిటీలు, ఐసిఎఆర్ సూచనలను పరిశీలించి, దానికి ఎంత తగ్గించారో డేటా నమోదు చేస్తారని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతానికి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) గణాంకాలే సరిగ్గా లేవు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఇ-క్రాప్ లింక్ అంటున్నా పంటలు వేశాక ఆ నమోదులు జరుగుతున్నాయి. ఇ-క్రాప్ అనేది ఆచరణసాధ్యం కాదన్నది వాదన. రాష్ట్రంలో కౌలు వ్యవసాయం గణనీయంగా

మిగతా 2లో

ఎసిబి విజయవాడ యూనిట్‌లో

కేసుల కొట్టివేతపై సుప్రీం ఆగ్రహం

- మధ్యంతర ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎసిబి విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌లో నమోదైన కేసులను గంపగుత్తగా కొట్టివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు పోలీసు స్టేషన్ హోదా లేదని ఇటీవల కేసులను ఎపి హైకోర్టు క్వాష్ చేసింది. దీనిని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పుపై అసహనం వ్యక్తం చేసింది. ఇంత దారుణంగా కూడా చట్టాలను అన్వయించుకుంటారా? అని ప్రశ్నించింది. ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? దర్యాప్తు ఏం జరుగుతుందో కూడా చూడకుండా కేసులు కొట్టేయడమేంటని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ఎసిబి నమోదు చేసిన అక్రమాస్తుల కేసులను ఇలా ఏకపక్షంగా కొట్టేయడమేంటని పేర్కొంది. ప్రతివాదులకు నోటీసులిచ్చిన ధర్మాసనం, హైకోర్టు ఉత్తర్వులు మరో ఏ ఒక్క కేసుకు అమలు కావని స్పష్టం చేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్న 11 ఎఫ్ఐఆర్‌లపై తదుపరి విచారణ కొనసాగించి చార్జిషీట్‌లు దాఖలు చేసేందుకు అనుమతినిస్తూ మధ్యంతర ఆదేశాలను ధర్మాసనం ఇచ్చింది. రాష్ట్రప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. విజయవాడలో యూనిట్ ఏర్పాటుచేసి, తదుపరి కార్యకలాపాలు సాగించేందుకు ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలు పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణ ఆరు వారాలు వాయిదా వేసింది.

ఉద్యమ స్ఫూర్తితో స్వచ్ఛాంధ్ర

జనవరి నుండి చెత్త కనిపించకూడదు

రెండోరోజు కలెక్టర్ల సమావేశంలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమలుచేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో కొనసాగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండవరోజైన మంగళవారం ఆయన స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలన్నారు. స్వచ్ఛ భారత్ కోసం రాష్ట్రంలో ఏ జిల్లాలోనైనా కేంద్రప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా కార్యక్రమం తీసుకుంటే దానిని రాష్ట్రమంతా వర్తింపజేయాలన్నారు. ఇప్పటికే 83 లక్షల టన్నుల చెత్తను రాష్ట్రవ్యాప్తంగా తొలగించామని, జనవరి నుండి చెత్త ఎక్కడా కనిపించకూడదని చెప్పారు. చెత్తపై పన్ను కూడా రద్దు చేశామన్నారు. స్వచ్ఛత అంటే పరిశుభ్రత పాటించడమే కాదని, ప్రజల ఆలోచనా విధానం కూడా మారాలని తెలిపారు. చెత్తను డ్రెయిన్లలో వేయడం వల్ల అవి ప్రవాహానికి అడ్డు వస్తున్నాయని, అలాంటి అలవాట్లు లేకుండా చేయాలని తెలిపారు. ఎలాంటి కార్యక్రమమైనా ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం అవుతుందని పేర్కొన్నారు.

చేతివృత్తులకు చేయూత

ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఆ బొమ్మలకు అవసరమైన కలప కోసం చెట్లు పెంచడానికి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చేతివృత్తులు, కులవృత్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. గిరిజన వెనుకబడిన ప్రాంతాల్లో వెదురుతో చేసే ఉత్పత్తులపై ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని, అవసరమైతే వారికి వెదురును సరఫరా చేసేలా చూడాలని తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద వ్యర్థాల షెడ్ల నిర్మాణానికి కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. సిసి రోడ్లు నిర్మించే సమయంలో ముందుగానే పైపులైన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాలను అర్బన్ సౌకర్యాలతో మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలన్నారు. చాలా ప్రాంతాల్లో సిసి రోడ్లు ఉన్నా, డ్రెయిన్లు సరిగా లేవని, అటువంటి చోట్ల మేజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని అన్నారు. పంచాయతీల్లో పిట్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. అత్యవసర పనులకు నిధులు తక్షణమే మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

గ్రీన్ కవర్‌ను అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో గ్రీన్ కవర్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. 2029 నాటికి 39 శాతానికి, 2047 నాటికి 50 శాతానికి పెంచాలని పేర్కొన్నారు. దీనిలో కార్పొరేట్ సెక్టార్‌ను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. నగర వనాలు అభివృద్ధి చేసి కార్తీక మాసాన్ని పండుగలా చేసుకోవాలని అన్నారు. పట్టణాల్లో స్వచ్ఛత కోసం తీసుకునే చిన్నచిన్న మార్పులే పెద్ద ప్రభావాన్ని చూపిస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో పవన్ కల్యాణ్ తదితరులు

రాష్ట్రాభివృద్ధికి పది సూత్రాలు

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం : సిఎం

మరిన్ని వార్తలు 2లో...

బీహార్‌లో సీట్ల సర్దుబాటు త్వరలో ఖరారు

- కేరళలో మళ్లీ ఎల్‌డిఎఫ్ సర్కారే
- సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్ శాసనసభ ఎన్నికలకు తమ పార్టీ సన్నద్ధంగా ఉందని, ఇక్కడ 'ఇండియా' ఫోరం పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయని సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబి తెలిపారు. ఈ చర్చలు సానుకూల వాతావరణంలో కొనసాగుతున్నాయని, త్వరలోనే ఖరారు ఒప్పందం చేసుకుంటామని చెప్పారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఉద్యమాలకు అనుకూల పరిస్థితులు న్నాయని, ప్రజల భాగస్వామ్యం పెరుగుతోందని ఆయన తెలిపారు. స్థానిక ఎకెజి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేరళలో ఐదేళ్ల క్రిందట ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారం నిలుపుకొని చరిత్ర సృష్టించిందని, ఇప్పుడు ఆ కొనసాగింపునకు మరో కొనసాగింపు కచ్చితంగా ఉంటుందని చెప్పారు. ప్రజానుకూల విధానాలు, సంక్షేమ పథకాలు, విపత్తు సమయాల్లో ప్రభుత్వం ఎదురొడ్డి ప్రజానీకాన్ని కాపాడుకున్న తీరుకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయని, ఈ నేపథ్యంలో కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వమే కొనసాగుతుందని, ఇందుకు అవసరమైన పరిస్థితులు, అవకాశాలు ఉన్నాయని తమ పార్టీ అంచనా వేస్తున్నట్లు బేబి తెలిపారు.

కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్ సహా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో సిపిఎం, భాగస్వామ్య పార్టీల సంసిద్ధతపై కేంద్ర కమిటీలో చర్చించినట్లు పేర్కొన్నారు. రాజకీయంగా, సంస్థాగతంగా ఎన్నికలను ఎదుర్కోవడానికి తమ పార్టీ శాఖలన్నీ సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ గొప్ప పురోగతి సాధించిందన్నారు. పార్టీ పిలుపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ప్రదర్శనలకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారని చెప్పారు.

నేరాల కట్టడిలో కేరళ ముందంజ

దేశంలో కేరళ అత్యంత సమర్ధవంతమైన పోలీసు వ్యవస్థను కలిగి ఉందని ఎంఎ బేబి అన్నారు. నేరాల కట్టడిలో దేశంలోనే ప్రశంసనీయ పాత్ర పోషిస్తోందని తెలిపారు. తీవ్ర నేరాలకు పాల్పడిన దోషులను శిక్షించడంలోనూ, నేరస్థులను పట్టుకొని చట్టం ముందు నిలబెట్టడంలోనూ మెరుగైన వ్యవస్థ కలిగివుందని చెప్పారు. 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వ కాలం నుండి కేరళ పోలీసు వ్యవస్థ దేశంలోని ఇతర రాష్ట్రాలకంటే మెరుగ్గా ఉందని, ఇదో ఆదర్శనీయమైన నమూనా అని పేర్కొన్నారు. అప్పటి వరకు.. ప్రభువులకు, పెట్టుబడిదారులకు సేవకులుగా ఉన్న పోలీసు వ్యవస్థను.. ఇఎంఎస్ ప్రభుత్వం సమూల ప్రక్షాళన చేసి ప్రజానుకూల పోలీసు వ్యవస్థకు బీజాలు వేసిందని చెప్పారు. జనమైత్రి పోలీసు విధానంలో కేంద్ర హోం శాఖ జోక్యం చేసుకోవడం వంటి వాటి కారణంగా ప్రస్తుతం పలు సమస్యలు తలెత్తున్నాయన్నారు.

నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు

- పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్‌టిఆర్ వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవ కింద ఆస్పత్రులకు సుమారు రూ.2 వేలకోట్లు వరకు చెల్లించాల్సిన బకాయిలు ఉండటంతో మంగళవారం నుంచి సేవలు తాత్కాలికంగా నిలిపేసినట్లు ఆశ అధ్యక్షులు డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. అత్యవసర వైద్యసేవలు, ఆపరేషన్లు యథావిధిగా సేవలు అందిస్తామన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టిఆర్ వైద్యసేవ సిఇఒ దినేష్‌కుమార్‌కు ఈ నెల 15న లేఖ రాశామన్నారు. ప్రభుత్వం తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బకాయిలను వెంటనే చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యూరియా సరఫరా చేయకుండా

రైతులకు ఊరింపులా?

సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా దాని వాడకాన్ని తగ్గించుకుంటే రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం ప్రజలను వంచించడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. కేంద్రం నుండి రూ.500 కోట్లు తీసుకొని రైతులకు యూరియా వాడకాన్ని తగ్గించుకోమని సుద్దులు చెప్పడం దారుణమని తెలిపారు. వ్యవసాయంలో నత్రజని పాత్ర కీలకమైందని పరిశోధనల్లో తేలిందని, ఆయా పంటలు, నేల స్వభావాన్ని బట్టి మోతాదు నిర్ణయించి వాడాల్సి వుంటుందని పేర్కొన్నారు. వ్యవసాయాభివృద్ధికి, ఆహార ధాన్యాల ఉత్పత్తికి కీలకమైన ఎరువులను అవసరమైనన్ని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది. నిలువు మీదనున్న పంటల దిగుబడి తగ్గకుండా వుండేందుకు అవసరమైనంత ఎరువులను సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని పేర్కొన్నారు. కానీ, ఎరువుల సబ్సిడీని తగ్గించుకోవాలన్న కక్కుర్తితో ఈ ఏడాది రాష్ట్రాలకు కేటాయింపు తగ్గించి, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలకే రాయితీ ఇస్తామని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. టిడిపి కూటమి ప్రభుత్వం దానికి తోడవ్వడం, మిగిలిన రాష్ట్రాలు పది శాతం తగ్గించుకోగా, ఆంధ్రప్రదేశ్ 25 శాతం కోతకు అంగీకరించడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువులనూ రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల మద్దతుతో వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించారని వివరించారు. ప్రభుత్వ సంస్థల ద్వారా సరఫరా చేయాల్సిందిపోయి పెత్తందార్లు చేజిక్కించుకోవడంతో ఎరువులకు కొరత ఏర్పడిందని తెలిపారు. అందువల్ల కొరత ఏర్పడగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ల కాన్ఫరెన్సులో యూరియా వాడకం తగ్గిస్తే బస్తాకు రూ.800 రాయితీ ఇస్తామని చెప్పడం రైతులను మభ్యపుచ్చడానికేనని విమర్శించారు. ఎరువుల కోటా తగ్గించుకొని దానికి బదులుగా రైతులను బలిపెట్టి కేంద్రం నుండి డబ్బులు తీసుకొని ఇప్పుడు వాటినే రైతులకు ఇస్తాననడం మోసపూరితమని తీవ్రంగా ఖండించారు. క్యాన్సర్ రావడానికి అనేక కారణాలుండగా యూరియా వాడకంతో వస్తుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని, ఏ వైద్య పరిశోధనా సంస్థ లేదా శాస్త్రవేత్త ఈ విషయం చెప్పారో ముఖ్యమంత్రి వెల్లడించాలని కోరారు. ఒకవేళ అదే నిజమైతే ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని

మిగతా 2లో

కోర్టు ఖర్చు 10వేలు చెల్లించండి

మండలి ఛైర్మన్‌కు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి

తాము ఆదేశించినప్పటికీ కౌంటర్ పిటిషన్ దాఖలు చేయని శాసనమండలి ఛైర్మన్ తీరును హైకోర్టు ఆక్షేపించింది. దీనికిగాను కోర్టు ఖర్చుల కింద పది వేల రూపాయలను బుధవారంలోగా చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘానికి జమ చేయాలని మండలి ఛైర్మన్‌ను, ఆ డబ్బుతో న్యాయ శాస్త్ర పుస్తకాలు కొనుగోలు చేసి అడ్వకేట్స్ లైబ్రరీలో ఉంచాలని సంఘం అధ్యక్షుడిని ధర్మాసనం ఆదేశించింది . తదుపరి విచారణను విచారణను ఈ నెల 19కి వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఆదేశాలిచ్చారు.

కైకలూరుకి చెందిన జయమంగళ వెంకటరమణ వైసిపి ఎమ్మెల్సీ పదవికి 2024 నవంబర్‌లో రాజీనామా చేసి జనసేనలో చేరారు. రాజీనామాను మండలి ఛైర్మన్ ఆమోదించేలా ఉత్తర్వులు ఇవ్వాలని వెంకటరమణ లేఖలు రాశారు. అయినప్పటికీ ఫలితం లేకోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజీనామా లేఖపై చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకునేలా మండలి ఛైర్మన్‌ను ఆదేశించాలని కోరారు. దీనిని గతంలో విచారించిన న్యాయమూర్తి, కౌంటర్ దాఖలు చేయాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించారు. అయితే, ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు కాలేదు. మంగళవారం జరిగిన విచారణలో మండలి ఛైర్మన్ తరఫున కౌంటర్ వేసేందుకు గడువు కావాలని అడ్వకేట్ కోరడంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తంచేశారు.



రాయలసీమలో నేడు భారీ వర్షాలు

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమలోని వైఎస్ఆర్ కడప, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో బుధవారం నాడు పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద ఎవరూ నిలబడరాదని సూచించింది. అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో పలుచోట్ల మంగళవారం నాడు వర్షపాతాలు నమోదయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 70 మిల్లీమీటర్లు, అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికపురంలో 66.5, పి గన్నవరంలో 64, పశ్చిమగోదావరి జిల్లా మురుటూరులో 58.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బల్క్ డ్రగ్ పార్క్ వద్దే వద్దు

- మూడో రోజూ కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

3

ఉత్తరాఖండ్, హిమాచల్ కకావికలం

- కుంభవృష్టితో మెరుపు వరదలు
- ఐదుగురు మృతి - 20 మందికి పైగా గల్లంతు
- భారీగా ఆస్తి నష్టం.. స్థంభించిన రాకపోకలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లో కకావికల పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 15న సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం వరకు పలుమార్లు కుంభవృష్టి సంభవించడంతో మెరుపు వరదలతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. పలుచోట్ల కొండ చరియలు విరిగిపడ్డాయి. ప్రధానంగా డెహ్రాడున్, రాయ్‌పుర్, రిషికేశ్ వంటి ప్రాంతాల్లో భారీ వర్షాలతో పరిసర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మట్టి చరియలు, కొండ చరియలు విరిగిపడటంతో రహదారులు ధ్వంసమయ్యాయి. రాకపోకలు స్థంభించాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడ చిక్కుకుపోయాయి. ఈ ఘటనల్లో 500 మంది వరకు వరద నీటిలో చిక్కుకోగా..సహాయక బృందాలు రక్షించాయి. అయితే వేర్వేరు చోట్ల జరిగిన ఘటనల్లో ఐదుగురు చనిపోయారని, మరో 20 మంది గల్లంతయ్యారని సంబంధిత అధికారులు తెలిపారు.

డెహ్రాడున్‌లోని పవుంధా ప్రాంతంలో దేవ్‌భూమి ఇనిస్టిట్యూట్ వరద నీటిలో చిక్కుకుపోవడంతో అందులోని 200 మంది విద్యార్థులను రాష్ట్ర విపత్తు నివారణ బలగాలు (ఎస్‌డిఆర్ఎఫ్) రక్షించాయి. రిషికేశ్‌లోని చంద్రభాగ నది ఉప్పొంగి ప్రవహించడంతో హైవే పైకి నీరు చేరింది. భారీ వాహనాలు కూడా వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద బాధిత ప్రాంతాలను మంగళవారం ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పరిశీలించారు. పెను విపత్తు నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యమంత్రికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు.



రుషికేశ్‌లో వరద నీటిలో చిక్కుకుపోయిన వాహనాన్ని ఒడ్డుకు చేర్చేందుకు ప్రయత్నిస్తున్న ఎస్‌డిఆర్ఎఫ్ బలగాలు

హిమాచల్ ప్రదేశ్‌లోనూ..

హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. మండి జిల్లా సుందర్‌నగర్ సబ్‌డివిజన్‌లో ఒక ఇంటిపై కొండచరియలు విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. ఇదే జిల్లాలోని ధరంపూర్‌లో బస్టాండ్ ఆకస్మిక వరదల్లో చిక్కుకుంది. దీంతో దుకాణాలు, 20కి పైగా బస్సులు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా మూడు జాతీయ రహదారులతో సహా 650 రోడ్లను మూసివేశారు. మంచి నీటి పథకాలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాబోయే 24 గంటల పాటు ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో ఈ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ విభాగం పేర్కొంది.

రాష్ట్రాభివృద్ధికి పది సూత్రాలు

- శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం
- కలెక్టర్ల సదస్సు ముగింపులో చంద్రబాబు దిశానిర్దేశం

కలెక్టర్ల కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధి పది సూత్రాల ఆధారంగా కూటమి పాలన సాగుతుందని, స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాల సాధనకు అందుబాటులో ఉన్న వనరుల్ని వినియోగించుకుని కలెక్టర్లు ముందుకు సాగాలని సిఎం చంద్రబాబునాయుడు కలెక్టర్లు, ఎస్‌పిలకు సూచించారు. రెండు రోజుల పాటు సచివాలయంలో జరిగిన కలెక్టర్లు, ఎస్‌పిల సమీక్షా సమావేశాల ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూశాఖలో పెండింగ్ ఫైల్స్ పేరుకుపోతుండటం, రాష్ట్రంలో సైబర్‌క్రైమ్ 16శాతం పెరగడం పట్ల సిఎం అసహనం వ్యక్తం చేశారు. ఉపాధికల్పనే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలని, 15శాతం వృద్ధి రేటుకు కృషి చేయాలని అన్నారు. వృద్ధి రేటుపై రాజీ లేకుండా పనిచేయాలని చెప్పారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించుకునేలా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్‌ప్రెన్యూర్, వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానాలను అవలంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తనతోపాటు డిప్యూటీ సిఎం

పవన్‌కల్యాణ్ అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్‌ఎనర్జీకి అత్యంత ప్రాధాన్యత నివ్వాలని, క్లీన్ అండ్ గ్రీన్ ఒక సంప్రదాయంగా మారాలని చెప్పారు. రోడ్లు, రైల్వేలు పోర్టులు, ఎయిర్‌పోర్టులను సమర్థంగా వినియోగించుకుని లాజిస్టిక్స్ వ్యయం తగ్గించాలని సిఎం పేర్కొన్నారు. వైద్యారోగ్య రంగంలో పెనుమార్పులు రానున్నాయన్నారు.

పంచగ్రామాల సమస్యను పరిష్కరించండి

రెవెన్యూశాఖ సమీక్షలో సిఎం మాట్లాడుతూ సింహాచలం భూముల పంచగ్రామాల సమస్యను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. రెవెన్యూ విభాగానికి వచ్చిన ఫిర్యాదుల్లో 70 శాతం ఆర్ఒఆర్‌కు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా ఉన్నాయన్నారు. ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఫిర్యాదులు, భూములకు సంబంధించిన వేర్వేరు అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయని సిఎం తెలిపారు. గత ప్రభుత్వం భూముల్ని కాజేసేందుకు ప్రజల ఆస్తులను 22ఎలో పెట్టి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. అభ్యంతరాలు లేని భూముల్ని రెగ్యులరైజ్ చేయాలని సిఎం కలెక్టర్లను ఆదేశించారు

'ఆ' కేసులు వెలికి తీసి న్యాయం చేయండి : హోమ్‌శాఖ సమీక్షలో సిఎం

హోమ్‌శాఖపై సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అత్యుత్తమ పనితీరు టెక్నాలజీ, ఇన్నోవేషన్లను అమలు చేయడం పోలీస్ శాఖలో కీలకమన్నారు. శాంతి భద్రతల విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన సుబ్రహ్మణ్యం హత్య, డాక్టర్ సుధాకర్, చంద్రయ్య హత్యకేసులతోపాటు అమర్‌నాథ్‌గౌడ్ కేసులను వెలికితీసి బాధితులకు న్యాయం చేయాలని సిఎం పోలీస్‌శాఖను ఆదేశించారు.

గంజాయి వినియోగం, రవాణాను అరికట్టేలా మరింత దృష్టిపెట్టాలని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని పేర్కొన్నారు. సైబర్‌క్రైమ్‌లో ప్రజలు నెలకు రూ.30 కోట్ల వరకు కోల్పోతున్నారని, క్రిమినల్స్ టెక్నాలజీ మాస్టర్లుగా ఉన్నారని వారికంటే పోలీసులు టెక్నాలజీలో అడ్వాన్స్‌గా మారాలని సిఎం సూచించారు.. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో డాగ్ స్క్వాడ్ ఉండాలన్నారు. వివేకా హత్య కేసు అతిపెద్ద ఘటనని, ఒక సిఐ దగ్గరుండి రక్తం కడిగించడమేంటని ప్రశ్నించారు. అప్పట్లో ఆ వివరాలేవి తన నోటీసుకు తీసుకురాలేదని అన్నారు. టూరిజం రావాలంటే భద్రత ఉండాలన్నారు. జిల్లాల్లో బ్యాండ్ విడ్త్ పెంచేందుకు ప్రయత్నిస్తామని, ఆర్‌టిజిఎస్‌తో లింక్ చేసి సమాచారం ప్రభుత్వం నుంచి ఇస్తామని అన్నారు.

జనవరికి రెండు క్వాంటం కంప్యూటర్లు

- 2027 నాటికి మరో మూడు
- ఐటి సెక్రటరీ భాస్కర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో రెండు క్వాంటం కంప్యూటర్లను 2026 జనవరి నాటికి ఏర్పాటు చేస్తామని, 2027 నాటికి ఐబిఎం సంస్థ మరో మూడు ఏర్పాటు చేస్తుందని ఐటి కార్యదర్శి కాటంనేని భాస్కర్ తెలిపారు. సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో భాగంగా రెండోరోజు ఐటి, క్వాంటం వ్యాలీపై భాస్కర్ ప్రజంటేషన్ ఇచ్చారు. గ్లోబల్ క్వాంటం డెస్టినేషన్‌గా రాష్ట్రాన్ని మార్చాలనే దిశగా పనులు చేపడుతున్నామని, దీనికోసం రెండుదశలుగా రోడ్‌మ్యాప్ రూపొందించుకున్నామని వివరించారు.

2030 కల్లా అమరావతి క్వాంటం వ్యాలీ నుండి ఏటా ఐదువేల కోట్ల మేర హార్డ్‌వేర్ ఎగుమతులు సాధించాలన్నదే లక్ష్యమని, దీంతోపాటు ఏటా ఐదువేలమందికి క్వాంటం కంప్యూటింగ్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

రూ.1000 కోట్ల ప్రోత్సాహకంతో క్వాంటం వ్యాలీలో 100 స్టార్టప్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించామని పేర్కొన్నారు. క్వాంటం వ్యాలీ రాకతో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. వైద్య, ఆరోగ్యం, బీమా, ఫైనాన్స్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, మెటీరియల్ సైన్స్ అండ్ కెమిస్ట్రీ, అప్టిమైజేషన్ అండ్ లాజిస్టిక్స్, క్లైమేట్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ సహా మొత్తం 14 రంగాల్లో క్వాంటం కంప్యూటింగ్‌తో అద్భుత ఫలితాలు రాబట్టవచ్చని తెలిపారు.

50 ఎకరాల్లో క్వాంటం వ్యాలీ

అమరావతి రాజధాని నగరంలో క్వాంటం వ్యాలీ కోసం 50 ఎకరాలు సిఆర్‌డిఎ కేటాయించిందని భాస్కర్ పేర్కొన్నారు. వాటిల్లో భవన నిర్మాణాలకు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ భవనంలో దాదాపు 80 వేల నుండి 90 వేల మంది పనిచేయనున్నారని తెలిపారు. పెట్టుబడులు కార్యకలాపాలు సాగించడానికి ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టి సంస్థలు ముందుకు వచ్చాయని అన్నారు. ఇప్పటికే అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కంపెనీ (ఎక్యూసిసి) ఏర్పాటుచేసి డైరెక్టర్లనూ నియమించామని వివరించారు. ఈ రంగంలో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో క్వాంటం టెక్నాలజీపై అవగాహన కల్పించేందుకు రాయబారులుగా వ్యవహరించాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని ఆయన చెప్పారు. కళాశాలల్లో విద్యార్థులకు క్వాంటం కంప్యూటింగ్ చదివేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

వారంతా ఫ్యూచర్ సైన్స్ సొసైటీకి సిద్ధంగా ఉండేలా చేయడంపై కలెక్టర్లు దృష్టి సారించాలన్నారు.

భవన నమూనాలపై సిఎం ప్రశంస

అమరావతిలో నిర్మించనున్న క్వాంటం వ్యాలీ భవన సముదాయ నమూనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో అద్భుత నమూనాను ఎంపిక చేశారని భాస్కర్‌ను అభినందించారు.

వైషమ్యాలు సృష్టించే వారి కదలికలపై నిరంతరం నిఘా

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజంలో సామాజిక వర్గాల మధ్య అంతరాలు సృష్టించే శక్తులు పెట్రేగిపోతున్నాయని, అలాంటి విద్రోహ శక్తుల పట్ల నిరంతర అప్రమత్తతతో పాటు నిఘా కూడా ఉంచాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పోలీస్ అధికారులకు సూచించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజు శాంతి భద్రతలపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు సమిష్టిగా కష్టపడదామన్నారు. సామాజిక వర్గాల మధ్య గొడవలు పెట్టేలా పెడుతున్న ఫ్లెక్సీలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, సభలు సమావేశాలపై పోలీసులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాంటి శక్తులను ముందస్తుగానే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అభివృద్ధిని నిరోధించే విధంగా ప్రజల్లో వైషమ్యాలు సృష్టించేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. మహిళల

భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని, సుగాలి ప్రీతి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకువెళ్ళాలన్నారు. సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల వద్ద, ముఖ్యండా బాలికల హాస్టళ్ల వద్ద సిసి కెమెరాలతో పాటు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. శబ్ద కాలుష్యకారకాలపై పరిమితులు అవసరమని, గత ప్రభుత్వంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద నిఘా విస్తృతం చేయాలని పవన్‌కల్యాణ్ అన్నారు. శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న డిజెలు, మైక్‌ల అనుమతులు వ్యవహారంలో పరిమితులు పాటించాలన్నారు. ముఖ్యంగా మతపరమైన కార్యక్రమాలు, సినిమా ఫంక్షన్స్‌లో డెసిబెల్ ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వ్యాప్తిపై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయి సప్లై చైన్‌ను బ్లాక్ చేస్తే సమాజంలో చాలా వరకు నేరాలు తగ్గుతాయని పవన్ కల్యాణ్ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైతే ప్రజల సహకారం తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.

19న జిఎస్‌టిపై నోటిఫికేషన్లు

- అక్టోబర్ 22 వరకు విస్తృత ప్రచారం
- ప్రజలకు తెలిసేలా పన్ను తగ్గింపు వివరాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త స్లాబులతో అమలులోకి రానున్న జిఎస్‌టిపై ఈ నెల 19వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నోటిఫికేషన్లు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కలెక్టర్ల సదస్సులో ఆదాయ వనరులపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆదాయాన్ని పెంచేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం, వాణిజ్య పన్నులు, గనులు, అటవీ, రిజిస్ట్రేషన్లు, రవాణా వంటి శాఖలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కావాల్సి ఉంటుందని, అందువల్ల కలెక్టర్లు కూడా జిల్లాల్లో ఆదాయం పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిఎస్‌టిపై మాట్లాడుతూ ఏ వస్తువు ఏ పన్ను విభాగంలో ఉంటుందో, వాటిపై ఎంత ధర తగ్గుతుందన్నది గ్రామస్థాయి వరకు ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రకటనలు కూడా జారీ చేయాలని సూచించారు. జిఎస్‌టి సంస్కరణల వల్ల ప్రజలకు ఎనిమిది వేల కోట్ల వరకు ఏటా మేలు కలుగుతుందని వివరించారు. అలాగే జిఎస్‌టి పన్నుల తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై వచ్చే నెల 22వ తేదీ వరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. జీవిత బీమా, ఆరోగ్యబీమాపై ప్రస్తుతం జిఎస్‌టి లేదని, ఇకపై ఎలాంటి ప్రయోజనం కలుగుతుందో అంచనా వేయాలని సూచించారు. జిఎస్‌టి, పన్ను ఆదాయాలు ఎలా ఉన్నాయన్న దానిపైనా జిల్లాల్లో పర్యవేక్షణ చేయాలని నిర్దేశించారు.

గనుల ఆదాయం పెరగాలి

గనులకు సంబంధించి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సిఎం సూచించారు. ఈ విషయంలో ఏయే జిల్లాలు వెనుకంజలో ఉన్నాయో గుర్తిస్తామని, ఆ జిల్లాలు మరింత గట్టిగా పనిచేయాల్సి ఉందని చెప్పారు. ఉచిత ఇసుక విధానంలోనూ కఠినంగా వ్యవహరించాలని, ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలని అన్నారు. వెయ్యి కోట్ల ఆదాయాన్ని కోల్పోయి మరీ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

అక్రమ కట్టడాలు గుర్తించండి

శాటిలైట్ చిత్రాల ఆధారంగా మున్సిపాల్టీల్లో అక్రమ కట్టడాలు గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. ఎక్కువ ఫిర్యాదులు రెవెన్యూ శాఖలోనే వస్తున్నాయని, వాటిపై కూడా దృష్టి సారించాలని అన్నారు. 22ఏ లో భూములను పెట్టేయడం వల్ల దుష్ఫలితాలు వచ్చాయని, ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా గతంలో ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు.

మద్యంలో ఆన్‌లైన్ చెల్లింపులే

గతంలో మద్యంలో భారీ కుంభకోణం జరిగిందని గుర్తు చేశారు. వేల కోట్లు పక్కదారి పట్టాయని, ఇకపై అటువంటి విమర్శలు రాకుండా చూసుకోవాలని సూచించారు. తయారీ నుంచి అమ్మకాల వరకు అంతా పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు. నూటికి నూరుశాతం ఆన్‌లైన్ పేమెంట్లు మాత్రమే జరగాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పునరావాసం, డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు జరగాలని చెప్పారు. అలాగే మద్యం ద్వారా వచ్చే ఆదాయంపైనా దృష్టి సారించాలన్నారు. వాహనాల పన్నులు, ఎర్రచందనం విక్రయాల ద్వారా ఆదాయం రావాలని నిర్దేశించారు.

త్వరలో రూర్బన్ పంచాయతీలు

- మండల కేంద్రాలైన 250 పంచాయతీలు ఎంపిక
- సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మండల కేంద్రాలైన, గిరిజన ప్రాంతాల్లోని మేజర్ పంచాయతీలను గుర్తించి రూర్బన్ పంచాయతీలుగా ఎంపిక చేసి టౌన్ ప్లానింగ్‌కు చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సచివాలయంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సు రెండో రోజైన మంగళవారం పంచాయతీరాజ్ శాఖపై సమీక్షలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ ప్రక్రియ ఉండాలన్నారు.

ఇందుకు ఒక వింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశానికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ రూపొందించిన విధి విధానాలను ఆ శాఖ కమిషనర్ కృష్ణతేజ వివరిస్తూ.. భవిష్యత్తులో నగర పంచాయతీలుగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పంచాయతీల్లో ముందుగానే టౌన్ ప్లానింగ్ ప్రక్రియను అమలు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచన మేరకు కసరత్తు పూర్తి చేశామని తెలిపారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియకు సంబంధించి ప్రెజెంటేషన్‌ను ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ ప్రక్రియలో 250 వరకూ పంచాయతీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.

ధృవీకరణ పత్రాలు మనమిత్రలో పొందాలి

- ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ రకాల ధ్రువపత్రాలను ప్రజానీకం ఇకనుండి 'మనమిత్రా' వాట్స్‌అప్ గవర్నెన్స్ నుండే డౌన్‌లోడ్ చేసుకోవాల్సిఉంటుందని ఐటి, ఆర్టిజి శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ జిల్లా కలెక్టర్లకు తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని కోరారు. కుల, నివాస, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఇతర అనేక రకాల ధృవీకరణ పత్రాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ధృవీకరణ పత్రాల కోసం ప్రజలను అధికారులు దయచేసి కార్యాలయాలకు పిలిపించుకోవద్దని సూచించారు.

ప్రజలు తమ మొబైల్ ఫోన్‌లోని మనమిత్ర వాట్సాప్ గవర్నెస్ యాప్‌లోనే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధృవీకరణ పత్రాలు డౌన్ లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న డిజిటల్ సర్టిఫికెట్లు సురక్షితమైనవని, ఇవి డిజిటల్ లాకర్లో ఉంటాయని, బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నందున వీటిని ఎవరూ ట్యాంపర్ చేయలేరని తెలిపారు. ప్రతి శుక్రవారం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ప్రతి ఇంటికి పంపి అక్కడ ప్రజలతో మమేకమై వారికి మనమిత్ర యాప్ ఎలా ఉపయోగించుకోవచ్చో వివరంగా తెలియజేయాలని సూచించారు. అధికారులకు సైతం వాట్సాప్ గవర్నెన్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ కార్యాక్రమాల అమలు, ఆయా జిల్లాలు, మండలాల్లో ఏ స్థాయిలో ఉంది, ప్రజల సంతృప్తి ఎలా ఉందనేది మనమిత్రలో తెలుసుకోవచ్చన్నారు.

యూరియా సరఫరా చేయకుండా

రైతులకు ఊరింపులా?

మొదటి పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. ఇప్పుడు ఎరువులు సరఫరా చేయలేక క్యాన్సర్ అని భయపెట్టడం ప్రజారోగ్యంపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధినే శంకించాల్సి వస్తుందని తెలిపారు. ఎరువు సరఫరాకు ఇ- క్రాప్ నమోదుతో లింక్ పెడుతున్న నేపథ్యంలో వాస్తవ సాగుదార్లను నమోదు చేయాలని కోరారు. కౌలు రైతులను రికార్డు చెయ్యకుండా లింకేజి నిబంధన అమలు చేస్తే సమస్య మరింత జటిలమవుతుందన్న విషయం ప్రభుత్వం గుర్తెరగాలని సూచించారు. భవిష్యత్తులో ఎరువులకూ ప్రభుత్వాలు నగదు బదిలీ విధానాన్ని తెచ్చే ప్రమాదం పట్ల అప్రమత్తంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కమిటీ రైతాంగానికి విజ్ఞప్తి చేసింది.

'ఎరువు' రాయితీ ఎలా?

మొదటి పేజీ తరువాయి

ఉంది. లక్షల ఎకరాలను లక్షలాది కౌలు రైతులు సాగు చేస్తున్నారు. ఇ-క్రాప్‌లో వారి పేర్లు నమోదు కావు. వాస్తవ సాగుదారులే ఎరువులు వినియోగిస్తారు. వారందరికీ నగదు ప్రోత్సాహకం ప్రశ్నార్ధకం. పిఎం-ప్రణామ్‌లో యూరియాతో పాటు డిఎపి, ఎంఒపి, ఎస్ఎస్‌పి, ఎన్‌పికె (కాంప్లెక్స్) ఎరువులను తగ్గించాలన్నది టార్గెట్. సిఎం చంద్రబాబు యూరియాను దృష్టిలో పెట్టుకొనే బస్తాకు రూ.800 అన్నారన్నది అధికారుల మాట. కేంద్రం యూరియాపై బస్తాకు రూ.1,700 సబ్సిడీ ఇస్తోంది కాబట్టి దానిలో సగం రైతుకు ఇన్సెంటివ్ ఇవ్వాలంటున్నారని తెలిసింది. మరి మిగతా ఎరువుల పరిస్థితేంటన్న ప్రశ్నలొస్తున్నాయి. ఎరువులను తగ్గించే రైతులకు క్యాష్ ఇన్సెంటివ్ అన్న చంద్రబాబు ప్రకటన అటు ప్రభుత్వం, అధికారుల్లో ఇటు రైతుల్లో గందరగోళానికి)దారి తీసింది.

కొత్త కౌలు రైతు చట్టాన్ని తేవాలి

- ఎపి రైతు, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భూ యజమాని సంతకంతో పనిలేకుండా, కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలని ఎపి రైతుసంఘం, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు పాత కౌలు చట్టాన్ని రద్దు చేసి, నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆయా సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కె ప్రభాకర్ రెడ్డి, ఎం హరిబాబు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయడంలో నిబంధనలు అడ్డంకిగా మారాయని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్.. కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించగా, ముఖ్యమంత్రి భూయజమాని ఇష్టపడితే ఐదేళ్లకు కార్డులు ఇవ్వండని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 11 నెలల కాలపరిమితితో కార్డులు ఇచ్చేందుకే యజమానులు సంతకం పెట్టడం లేదని, ఐదేళ్లకు ఎలా అంగీకరిస్తారని ప్రశ్నించారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కార్డులివ్వాలన్నారు. యూరియా బస్తాపై కేంద్రం రూ.2,600 వరకూ సబ్సిడీ భరిస్తుందని, దాన్ని తగ్గించుకునేందుకు వాడకం తగ్గించిన రాష్ట్రాలకు కట్టకు రూ.800 ఇస్తానంటూ రైతులకు, రాష్ట్రాలకు అన్యాయం చేస్తుందన్నారు. మిగిలిన రాష్ట్రాలు ఎరువుల కోటాలో 10 శాతం తగ్గించుకుంటే, రాష్ట్రం 25 శాతం ఎందుకు తగ్గించుకుందో సిఎం సమాధానం చెప్పాలన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా ఆక్వా రంగానికి యూనిట్ రూ.1.50లకే విద్యుత్ సరఫరా చేయాలని ఎపి ఆక్వా రైతు సంఘం, రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. మేత తయారీ సంస్థలు ఎంఆర్‌పిపై కేవలం రూ.4 తగ్గించాయని, ముడి పదార్థాల ధరలు తగ్గిన ప్రకారం కనీసం రూ.20 తగ్గించేందుకు అవకాశం ఉందని పేర్కొంటూ.. ఎపి ఆక్వా రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి బలరామ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు.

పంటల ధరలు పడిపోయినప్పుడు బోనస్ ఇచ్చినట్లే ఆక్వా రైతులకు గతంలో పొందిన రేటు అందేటట్లు చేయాలన్నారు. ముఖ్యమంత్రి.. కేంద్ర మంత్రులకు లేఖ రాస్తూ ఎగుమతిదారులు, ఆక్వా కంపెనీల కోసం రాయితీలు కోరారని, పంట సాగు చేసి నష్టాల పాలవుతున్న ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వడం మరిచిపోవడం న్యాయం కాదని పేర్కొన్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలి

- వాటిని ప్రైవేటువారికి అప్పగించడమంటే వైద్య విద్యను వ్యాపారం చేయడమే
- పిపిపికి ఇవ్వనున్న మెడికల్ కళాశాలల నిర్మాణాలను పరిశీలించిన సిపిఎం బృందాలు

పెనుకొండలో అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా), పెనుకొండ (శ్రీసత్యసాయి జిల్లా)

ప్రభుత్వమే వైద్య కళాశాలలను నడపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. వాటిని ప్రైవేట్‌వారికి అప్పగించడమంటే వైద్య విద్యను వ్యాపారం చేయడమేనని తెలిపారు. పిపిపి విధానానికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పది మెడికల్ కళాశాలను పిపిపికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో మధ్యలో ఆగిపోయిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని సిపిఎం బృందం మంగళవారం పరిశీలించింది. పరిశీలన అనంతరం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా దగ్గులూరులో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మీడియాతో మాట్లాడారు. మెడికల్ కాలేజీ నిర్మాణం పేరుతో ఈ గ్రామంలో 60 ఎకరాల భూమిని సేకరించారన్నారు. 2025 ఆగస్టు రెండో తేదీ నాటికి పనులు పూర్తి చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ల్యాండ్ ఫిల్లింగ్ పూర్తి చేశారని, ఫౌండేషన్ ప్రాథమిక స్థాయిలో ఉందని తెలిపారు. ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులన్నీ ఆగిపోయాయన్నారు. వీటిని పూర్తి చేయకపోగా పిపిపి పద్ధతిలో ప్రయివేటు వాళ్లకు అప్పగించడం అన్యాయమని తెలిపారు. దీనివల్ల వైద్య విద్య మరింత ఖరీదు కానుందని తెలిపారు. ఈ బృందంలో సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్యులు కానేటి బాలరాజు, పాలకొల్లు ఏరియా కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరిశీలన అనంతరం పెనుకొండలో సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణ దశలో ఉన్న వైద్య కళాశాలలను ప్రభుత్వమే తక్షణం పూర్తి చేయాలని, వాటిని ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతుందన్నారు. చైనా, రష్యా తదితర దేశాల్లో వైద్య విద్య రూ.40 లక్షల్లో పూర్తి అవుతున్నా మన దేశంలో దాదాపు కోటి రూపాయలు అవుతోందని వివరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు మంచి మెరిట్‌తో ర్యాంకులు సాధించి తక్కువ ఖర్చుతో వైద్య విద్యను అభ్యసించాలంటే ప్రభుత్వ వైద్య కళాశాలలతోనే సాధ్యమని తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈరేష్, నామాల నాగార్జున, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు హరి తదితరులు పాల్గొన్నారు.

వంకవారిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ఆయుధ డిపోను తరిమికొడతాం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి (ఏలూరు)

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయతలపెట్టిన నేవీ ఆయుధ డిపోను ఏజెన్సీ నుంచి తరిమికొడతామని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయుధ డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ వామపక్షాలు, గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వంకవారిగూడెంలో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామ్మోహన్ మాట్లాడుతూ... ప్రజా తీర్పుకు వ్యతిరేకంగా నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సన్నాహాలు చేయడం దారుణమన్నారు. ఇది గిరిజన చట్టాలను వ్యతిరేకించడంతో పాటు గిరిజనుల మనుగడను నాశనం చేయడమేనని విమర్శించారు. తమ ప్రాంతంలో ఆయుధ డిపో ఏర్పాటు చేయొద్దని మూడుసార్లు గ్రామ పంచాయతీ తీర్మానించినా మళ్లీ ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఆయుధ డిపోకు వ్యతిరేకంగా 23న కలిసొచ్చే గిరిజన సంఘాలు, వామపక్షాలు, ఇతరులను కలుపుకుని మడకంవారిగూడెం, చీమలవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకవారిగూడెం మీదుగా జీలుగుమిల్లి వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ... ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పోలవరం ఎమ్మెల్యే, ఏలూరు ఎంపి పని చేస్తున్నారని వివరించారు. ఈ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కమీషన్ల కోసమే ఆయుధ డిపో మళ్లీ తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, ప్రజాసంఘాల నాయకులు ఇ.భూషణం, సరిపెల్ల అప్పారావు, కొల్లూరు దావీదు, తెల్లం శంకరుడు, తెల్లం అబ్బులు, సిపిఐ (ఎంఎల్) నాయకులు తగరం బాబూరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సిలో మెరిట్‌లో ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి అభ్యర్థులను రిజర్వేషన్ కేటగిరిలో లెక్కించడం రాజ్యాంగ విరుద్ధమని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ వెల్లడించింది. ఇది ఆయా తరగతుల రాజ్యాంగ బద్ధమైన హక్కులను హరించే చర్యగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిజర్వేషన్లు మెరిట్ ద్వారా సాధించని అభ్యర్థుల కోసం రక్షణాత్మక చర్య అని, సుప్రీంకోర్టు అనేక కీలక తీర్పుల్లో మెరిట్ ద్వారా ఎంపికైన ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు సాధారణ కేటగిరి సీట్లలో లెక్కించబడతారని పేర్కొందన్నారు. డిఎస్‌సిలో మెరిట్‌లో ఎంపికైన ఎస్సి, ఎస్‌టి అభ్యర్థులను రిజర్వేషన్ కోటాలో లెక్కించడం రాజ్యాంగ ఉల్లంఘన, సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించడం, ఆయా వర్గాల న్యాయమైన అవకాశాలను అడ్డుకునే చర్య అని, దీనిని కెవిపిఎస్ ఖండిస్తుందని పేర్కొన్నారు.

ఎడ్‌సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పు

ప్రజాశక్తి - ఏఎన్‌యు (గుంటూరు జిల్లా)

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా అనుబంధ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బిఇడి) కోర్సులో ప్రవేశాలకు సంబంధించి ఎపిఎడ్ సెట్-2025 షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ ఎవివిఎస్.స్వామి తెలిపారు. వెబ్ ఆప్షన్స్ కళాశాలల ఎంపిక ప్రక్రియ ఈనెల 17 వరకు, వెబ్ ఆప్షన్స్ కళాశాల మార్పు ఈనెల 18కు వాయిదా వేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ప్రక్రియ ఈనెల 20న జరుగుతుందన్నారు. ఈనెల 22 నుండి బిఇడి తరగతులు ప్రారంభమవుతాయని, ఆయా కళాశాలలో సీట్లు పొందిన అభ్యర్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

కృష్ణా జిల్లా గన్నవరంలో రణభేరి యాత్ర ప్రారంభిస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కె లక్ష్మణరావు తదితరులు

అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో రణభేరి జాతాను అడ్డుకుంటున్న పోలీసులు

విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి

- రణభేరి జాతాలో యుటిఎఫ్ డిమాండ్
- రాజవొమ్మంగిలో జాతాను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - యంత్రాంగం

విద్యారంగ, ఉపాధ్యాయరంగ సమస్యలు పరిష్కరించాలంటూ యుటిఎఫ్ చేపట్టిన రణభేరి జాతాలు మంగళవారం కొనసాగాయి. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన సమస్యలు ఇప్పటి వరకు పరిష్కరించలేదని, కనీసం ఉపాధ్యాయ, ఉద్యోగ నేతలతో మాట్లాడేందుకు సిఎం చంద్రబాబుకు తీరిక లేదని పలువురు నాయకులు విమర్శించారు.

కాకినాడ జిల్లా నుంచి అల్లూరి జిల్లాలోకి ప్రవేశించిన జాతాను రాజవొమ్మంగిలో పోలీసులు అడ్డుకున్నారు. జాతాకు అనుమతి లేదని, జెండాలు తీసివేయాలని పోలీసులు చెప్పారు. శాంతియుతంగా చేస్తున్న జాతాను అడ్డుకోవడం తగదని యుటిఎఫ్ నేతలు చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఆయా చోట్ల జరిగిన సభల్లో సంఘం రాష్ట్ర కార్యదర్శులు అరుణకుమారి, రవి చక్రవర్తి, విజయగౌరి మాట్లాడారు. ఉపాధ్యాయులపై పనిభారం మోపడం తగదన్నారు. డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, పిఆర్‌సిని అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, దేవీపట్నం మండలాల మీదుగా యాత్ర సాగింది.

కృష్ణా జిల్లా గన్నవరంలో ప్రారంభమైన బైక్ ర్యాలీనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల వల్ల ఆర్థిక రంగానికి, విద్యార్థులకు జరిగే మేలు ఏమిటో తెలియజేస్తూ ప్రభుత్వం ఓ శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతోందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి 25న విజయవాడలో వేలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు. కంకిపాడు, గుడ్లవల్లేరు, ఉయ్యూరు మీదుగా మచిలీపట్నం వరకు ర్యాలీ కొనసాగింది.

తిరుపతిలో ప్రారంభమైన రణభేరి ప్రచార జాతానుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్-ఎస్ ప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులను రద్దు చేయాలని, వారి సమయాన్ని వారి బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 13 వేలకు పైగా పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయని, ఒక ఉపాధ్యాయుడు ఐదు తరగతులకు బోధన చేయడమే ఇబ్బందిగా ఉన్న పరిస్థితుల్లో, అనేక రకాలైన బోధనేతర కార్యక్రమాలను అప్పగించడం దారుణమన్నారు. ఈ జాతా తిరుపతి నుంచి వెంకటగిరి, శ్రీకాళహస్తి మీదుగా సూళ్లూరు పేటకు చేరుకుంది.

అనంతపురం జిల్లా గుంతకల్లు, విడపనకల్లు, వజ్రకరూరు, ఉరవకొండ ప్రాంతాల్లో జాతా కొనసాగింది. గుంతకల్లు సరోజినీ నాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యూనియన్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. 12వ పిఆర్‌సిని నియమించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఆర్ ప్రకటించాలని, గ్రాట్యుటీ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఇహెచ్ఎస్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. నేడు సత్యసాయి జిల్లాల్లో యాత్ర కొనసాగనుంది.

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ప్రారంభమైన జాతా నీలకంఠాపురం, కురుపాం మీదుగా పార్వతీపురం చేరుకుంది. కొత్తవలస ఫ్లై ఓవర్ నుంచి చర్చి జంక్షన్ వరకూ ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ...టిడిపికూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలోనూ, ఆర్థిక బకాయిలు చెల్లించడంలోనూ ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ... యాప్‌లను రద్దు చేస్తామన్న విద్యాశాఖ 'లీప్' యాప్‌లోనే అనేక యాప్‌ల పని భారాన్ని చూపించిందని, దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పే విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, ఇది విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని వివరించారు. అనంతరం సీతానగరం, బొబ్బిలి మీదుగా సాలూరుకు జాతా చేరుకుంది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - సి.బెళగల్ (కర్నూలు)

పిలిప్ (ఫైల్)

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా సి బెళగల్ మండలంలో చోటు చేసుకుంది. బెళగల్ ఎఎస్ఐ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం... బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన పిలిప్ (55) ఐదు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో పత్తి, కంది పంటలను, ఒక ఎకరంలో ఉల్లి పంట సాగు చేశారు. అధిక వర్షాల వల్ల పత్తి పంటకు తెగులు సోకి పూర్తిగా దెబ్బతింది. ఉల్లి పంటకు ప్రస్తుతం ధర పూర్తిగా పడిపోయింది. పంటల సాగుకు పెట్టుబడుల కోసం చేసిన అప్పులు మొత్తం రూ.15 లక్షలకు చేరుకున్నాయి. దీంతో అప్పులు ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపంతో సోమవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబీకులు పిలిప్‌ను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆయన మంగళవారం మృతి చెందారు. పిలిప్‌కు భార్య సుజాత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ తెలిపారు.

గొర్రెల మేతగా ఉల్లి

ధర లేదని 4.5 ఎకరాల్లో పంట వదిలేసిన రైతు

రూ.3.4 లక్షలు నష్టం

ప్రజాశక్తి - దేవనకొండ

రైతులకు ఉల్లి పంట కన్నీరు తెప్పిస్తోంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో కోత ఖర్చులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. దీంతో రైతులు ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేశారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో రైతు రేమట వలి సాహెబ్ 4.5 ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. ఈ సమయంలో ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. పంట కోత కోయిస్తే కూలీల ఖర్చులు కూడా రావని ఉల్లి పంటలోకి మేతకోసం మంగళవారం గొర్రెలను వదిలేశారు. ఉల్లి పంట సాగు కోసం మొత్తం రూ.3.4 లక్షలు పెట్టుబడి పెట్టానని, ధర లేకపోవడంతో ఉల్లి పంట గొర్రెలకు మేతగా వదిలేశానని రైతు వలిసాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్లి ధర మార్కెట్లో కేవలం క్వింటాలు రూ.300 నుండి రూ.500 లోపు మాత్రమే పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పంటల ధర పతనంలో చంద్రబాబు రికార్డు

- మాజీ సిఎం జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంటల ధర పతనంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రికార్డు సాధించారని మాజీ సిఎం వైఎస్ జగన్ విమర్శించారు. మంగళవారం ఎక్స్‌లో ఈ మేరకు పోస్ట్ చేశారు. కర్నూలులో కిలో ఉల్లి మూడు రూపాయలని, కిలో టమోటా రూపాయిన్నరని, ధరలు ఇలా ఉంటే రైతులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కొన్ని వారాలుగా రైతులు లబోదిబోమంటున్నా కనికరం కూడా చూపడం లేదన్నారు. ముఖ్యమంత్రిగా రైతులను ఆదుకోవడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం ఉండి ఏం లాభమని ప్రశ్నించారు. క్వింటా ఉల్లిని రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటనల మీద ప్రకటనలు చేశారని, కర్నూలు మార్కెట్లో వేలం వేయించి ఎవరూ కొనడం లేదని చెప్పడానికి చేసిన ప్రయత్నం తప్ప మరొకటి కాదని అన్నారు. తూతూ మంత్రంగా వదిలేశారని తెలిపారు. ఉల్లికి ధర లేదని చెబుతున్నారని, ఆన్‌లైన్ స్టోర్లలో కిలో ఉల్లి రూ.29 నుంచి రూ.32 వరకూ ఉందని వివరించారు. రైతు బజార్లోనూ కిలో రూ.25కు తక్కువ అమ్మడం లేదని, మరి రైతులకు ధర ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. వారిని ఆదుకునేందుకు కనీస దృష్టి పెట్టకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. టమోటా ధరలు దారుణంగా పడిపోయినా పట్టించుకోవడం లేదని, కొనేవారు లేక రోడ్డుపై పారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రైతుల పంటలు కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని ఆయన సిఎంకు సూచించారు.

ప్రభుత్వ ఆస్తులు అమ్మడమే చంద్రబాబు విజన్

- వైసిపి నాయకులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఆస్తులను కారుచౌకగా బినామీలకు అమ్మడమే సిఎం చంద్రబాబు విజన్ అని వైసిపి ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 15 నెలల కూటమి పాలనలో అన్ని వ్యవస్థలూ ధ్వంసమయ్యాయని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల ఉనికే ప్రశ్నార్థకమైందని విమర్శించారు. మెడికల్ కళాశాలల ప్రెజెంటేషన్‌లో జగన్ చేసిన పనిని తాను చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాల అమల్లో వైఫల్యం ఉంటోందని, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు సహకరించాలని సూచించడం దిగజారుడుతనమని అన్నారు. రైతుకు యూరియా బస్తా కూడా అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, పోలవరం ప్రాజెక్టును ఇప్పటికీ ప్రశ్నార్థకం చేస్తున్నారని విమర్శించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, మెడికల్ కళాశాలలు, టూరిజం, ఇలా ఏ ఒక్క విభాగాన్ని వదలకుండా అన్నిటినీ ప్రైవేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్నారు : చెల్లుబోయిన

కులాల మధ్య చిచ్చుపెట్టడమే కూటమి సర్కారు లక్ష్యంగా కనిపిస్తోందని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లేని సమస్య ఉన్నట్లు చెప్పి మంత్రి సుభాష్ అశాంతిని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. జిఓ 16 అమలు చేస్తానంటూ శెట్టి బలిజలను రెచ్చగొట్టారని, వ్యతిరేకత రావడంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగారని అన్నారు. గీతకులాలకు మంత్రి సుభాష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బిజిసి డైరెక్టర్ల నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (బిజిసి) డైరెక్టర్లుగా అధికారులు మినహా 15 మందిని నియమించారు. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సిడిఎంఎ, ఎపియుఎఫ్ఐడిసి ఎమ్‌డి, ఎపిజిబిసి ఎమ్‌డి డైరెక్టర్లుగా ఉండనున్నారు. వీరితోపాటు ఎం సుగుణమ్మ, కనపర్తి గంగాధర్, ముప్పల వెంకట సుబ్బయ్య, పాడెం నాగకృష్ణ, కాసు పెంటారెడ్డి, మొల్లి పెంటిరాజు, ఆర్ లక్ష్మీదేవి, పులివెల రమేష్‌బాబు, గద్దాడ సత్యవేణి, వేల్పుల సింగయ్య, పల్లి శ్రీనివాసరావు, సువ్వాడ వనజాక్షి, వడగల వీరవెంకట బుచ్చిరాజు, నలకుర్తి విజయ, కటికే యోగానంద్‌ను డైరెక్టర్లుగా నియమించారు.

డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయండి

- విద్యా భవన్ వద్ద నిరసనలో డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యాభవన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న డిఎస్‌సి అభ్యర్థులు

నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్రప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, ఈ డిఎస్‌సిలో జరిగినంత గందరగోళం గతంలో ఏ డిఎస్‌సిలోనూ జరగలేదని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న విమర్శించారు. డిఎస్‌సి అభ్యర్థుల అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయమైన 'విద్యా భవన్' వద్ద మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఓపెన్ కేటగిరీలో ఎంపికైన రిజర్వేషన్ అభ్యర్థికి అదే కేటగిరిలో ఇవ్వకుండా రిజర్వేషన్ పోస్టు ఇచ్చి సామాజిక న్యాయాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతుందన్నారు. రిజర్వేషన్ పోస్ట్ ఇవ్వాల్సిన అభ్యర్థులకు బదులు క్రీడా, పిహెచ్‌సి, మాజీ సైనికులకు పోస్టులు కేటాయిస్తున్నారని తెలిపారు. మొత్తం డిఎస్‌సి పరీక్షల నిర్వహణ దగ్గర నుంచే గందరగోళం ఉందన్నారు. జిల్లాలకు కులాల వారీ కటాఫ్ బహిరంగంగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

కాల్ లెటర్ ఇచ్చి, ధ్రువీకరణ పత్రాల వెరిఫికేషన్ చేసి, తరువాత ఎందుకు పోస్ట్ ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో ఫేక్ సర్టిఫికెట్లపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. డిఎస్‌సి అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలని, అవినీతికి తావు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టు దిమ్మలు ధ్వంసం

- గ్రామాల్లోకి అడుగు పెడితే తరిమికొడతామని ఆదివాసీల హెచ్చరిక

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం కోసం పాతిన సిమెంట్ దిమ్మను బద్దలు కొడుతున్న ఆదివాసీలు

అల్లూరి జిల్లా అరకులోయ మండలం లోతేరు పంచాయతీ పరిధి కాగువలస, లోతేరు మధ్య నవయుగ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం పాతిన సరిహద్దు సిమెంట్ దిమ్మలను ఆదివాసీలు ధ్వంసం చేశారు. తమ జీవితాలను జలసమాధి చేసే ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎవరైనా తమ గ్రామాల్లోకి వస్తే తరిమితరిమి కొడతామని హెచ్చరించారు. ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పోరాట కమిటీ నాయకులు కిల్లో నోబో, కొర్ర స్వామి అధ్యక్షతన అక్కడే ఆందోళన, సభ కొనసాగించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ గుజ్జేలి పరిసర ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం నవయుగ కంపెనీతో టిడిపి కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుని, 2400 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం జిఓ 51ని జారీ చేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం ఇక్కడ చేపడితే లోతేరు పంచాయతీలో 20 గ్రామాలు, ఇరగాయి పంచాయతీలోని ఐదు గ్రామాలు, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలంలో ఎనిమిది గ్రామాలు జలసమాధి కానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేల ఎకరాల భూములు, చెట్లు, జీవరాశులు నాశనమవుతాయన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రాత్రీ పగలు డ్రోన్ కెమెరాలు, హెలికాప్టర్లతో నవయుగ కంపెనీకి చెందిన వ్యక్తులు సర్వేలు చేస్తుండడంతో గిరిజనులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని రద్దు చేయని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జి బుజ్జిబాబు, రామారావు, నానిబాబు, గురుమూర్తి, రాజు, అప్పలస్వామి, బాబూరావు, కె ప్రసాద్, రామచందర్, సింహాద్రి, గెన్ను, జగన్నాథం, వెంకటరావు, రామ్మూర్తి, కిల్లో రామన్న, కొర్ర మోహన్‌రావు, రామారావు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణపై సుప్రీం మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నాం

- ఆవాజ్ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వక్ఫ్ చట్ట సవరణ (2025) అంశంలో సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పును స్వాగతిస్తూ, భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేయడంతో మరింత సమగ్రమైన, నిష్పక్షపాతమైన ఫలితం లభిస్తుందని ఆవాజ్ రాష్ట్ర కమిటీ పేర్కొంది. కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీం కోర్టు కొన్ని కీలక సెక్షన్లను తాత్కాలికంగా నిలిపివేయడంపై ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ క్రిష్టి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డులో నలుగురి కంటే ఎక్కువ ముస్లిమేతరులు సభ్యులుగా ఉండకూడదని, రాష్ట్రస్థాయిలో ముగ్గురి కంటే ఎక్కువ ముస్లిమేతరులు సభ్యులుగా ఉండకూడదనే నిబంధనలను, వక్ఫ్ బోర్డు అధికారి ముస్లిం సమాజానికి చెందిన వ్యక్తి అయితే మంచిదని సుప్రీం కోర్టు సూచించినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన సవరణను మాత్రం నిలిపివేయలేదన్నారు.

ఆన్‌లైన్ ఫుడ్ మరింత ప్రియం

- డెలివరీ ఛార్జీలపై 18 శాతం జిఎస్‌టి

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో సంస్థలు ఇప్పటికే భారీగా పెంచిన ప్లాట్‌ఫామ్ ధరలకు తోడు డెలివరీ సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఇప్పటి వరకు ఫుడ్ డెలివరీపై 5 శాతం జిఎస్‌టి అమల్లో ఉండగా.. సెప్టెంబర్ 22వ తేది నుంచి ఇది 18 శాతానికి పెరగనుంది. డెలివరీ ఛార్జీలపై ఇకపై కొత్తగా విధించనున్న 18 శాతం జిఎస్‌టితో జొమాటో వినియోగదారులపై ఆర్డరుకు రూ.2 చొప్పున, స్విగ్గీ కొనుగోలుదార్లపై రూ.2.6 చొప్పున భారం పడే అవకాశం ఉంది. ఈ భారాన్ని వినియోగదారులపై వేయడానికి ఫుడ్ డెలివరీ సంస్థలు సన్నద్ధం అవుతోన్నాయి.

ఒకప్పుడు ఈ సంస్థలు డెలివరీ ఛార్జీ మాత్రమే వసూలు చేసేవి. బాగా వాడుకలోకి వచ్చిన తర్వాత లాభాలను పెంచుకునేందుకు 2022లో రూ.2 ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేయడం ప్రారంభించాయి. క్రమంగా దీన్ని జొమాటో రూ.12.50కు, స్విగ్గీ రూ.15కు చేర్చింది. దీంతో ఆన్‌లైన్ ఆహారం మరింత ప్రియం అయ్యింది.

దళితవాడల్లో వెయ్యి ఆలయాల నిర్మాణం

- తొలిసారిగా బ్రహ్మోత్సవాలు పరిశీలించనున్న ఇస్రో
- 24 'శ్రీవారి'కి పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం
- పాలకమండలి నిర్ణయాలు వెల్లడించిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుమల

ఈనెల 23న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుందని, 24న ధ్వజారోహణం రోజున రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. చంద్రబాబునాయుడు ఆదేశాలతో దళితవాడల్లో వెయ్యి ఆలయాలు నిర్మించాలని పాలక మండలిలో తీర్మానం చేశామని చెప్పారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు ఆలయాల చొప్పున నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి పాలకమండలి సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం పాలకమండలి నిర్ణయాలను మీడియాకు బిఆర్‌నాయుడు వెల్లడించారు. 23 నుంచి అక్టోబర్ రెండు వరకూ సిఫార్సు లేఖలపై విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా వారి చేతులకు జియో ట్యాగింగ్ విధానం అమలు చేయనున్నట్లు చెప్పారు. టిటిడి చరిత్రలో మొదటిసారి బ్రహ్మోత్సవాలను ఇస్రో పరిశీలించనుందన్నారు. ఎప్పటికప్పుడు రద్దీ క్రమబద్ధీకరణకు శాటిలైట్ పిక్చర్ ఉంటాయన్నారు. టిటిడిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని నిర్ణయం తీసుకున్నామని, తప్పుడు ప్రచారాలు చేసేవారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. టిటిడి ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడితే జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

శ్రీవారి ఆలయంలోకోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా జరిగింది. మీడియాతో ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాలు, ఉగాది, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి ముందు వచ్చే మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆగమానుసారంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయంలోని ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజాసామగ్రిని శుద్ధి చేసినట్లు తెలిపారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా భారీ ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు, నాయకులు

బల్క్‌డ్రగ్ పార్క్ వద్దే వద్దు

- కేసులకు భయపడేది లేదు
- మూడో రోజూ కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

తమ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేసి మా బతుకులను నాశనం చేయొద్దంటూ నక్కపల్లి మండలం రాజయ్యపేటలో మత్స్యకారులు తలపెట్టిన ఆందోళన మంగళవారానికి మూడో రోజుకు చేరుకుంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆందోళన కొనసాగించారు. వారి పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నాయకులు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జడ్‌పిటిసి సభ్యులు గోసల కాసులమ్మ, గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అనుమతి ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల బతుకులు బుగ్గిపాలు అవుతాయని వివరించారు. ఇప్పటికే పరవాడ, అచ్యుతాపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫార్మా కంపెనీల వల్ల ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ ప్రాంతమంతా ఫార్మా వ్యర్థ రసాయనాలతో కలుషితమైందని, తాగునీరు కరువైందని తెలిపారు. పిల్లలు పుట్టరన్న కారణంతో ఆయా ప్రాంతాల్లో వారికి వివాహాలు కష్టతరంగా మారాయన్నారు. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో కూడా అదే పరిస్థితి నెలకొంటుందన్నారు. మత్స్యకారులు మాట్లాడుతూ 35 మందిపై ఇప్పటికే కేసులు నమోదు చేశారని, పోలీసు నిర్బంధానికి, హెచ్చరికలకు తాము భయపడేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పిక్కి సత్తియ్య, పిక్కి కోదండరావు, సిపిఎం నాయకులు ఎం సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు సార్లు వడ్డీ కోత..!

- డిసెంబర్ కల్లా ఉండొచ్చు
- మోర్గాన్ స్టాన్లీ అంచనా

ముంబయి : పండుగ సీజన్‌లో మరో రెండు సార్లు వడ్డీ రేట్లలో కోతలు ఉండొచ్చని అంతర్జాతీయ ఏజెన్సీలు అంచనా వేస్తోన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వచ్చే అక్టోబర్, డిసెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉందని గ్లోబల్ బ్రోకరేజీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ తెలిపింది. రెండు దఫాల్లో మొత్తంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టొచ్చని విశ్లేషించింది. ఒక వేళ అదే జరిగితే రుణాలు చౌకగా మారనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 4 శాతం కంటే దిగువన నమోదు కావొచ్చని అంచనా వేసింది. ద్రవ్యోల్బణం కట్టడిలోనే ఉన్నందున రానున్న రెండు సమీక్షల్లో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండొచ్చని విశ్లేషించింది. మరోవైపు జిఎస్‌టి శ్లాబుల తగ్గింపునతోనూ ధరలు మరింత దిగిరావొచ్చని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

గడిచిన ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో రెపోరేటును 0.25శాతం చొప్పున ఆర్‌బిఐ తగ్గించింది. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. అలా మూడు వరుస సమీక్షల్లో కలిపి రెపోరేటు 1 శాతం తగ్గింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టులో మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం రెండు విడతల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గితే.. రెపో రేటు 5 శాతానికి తగ్గనుంది.

సంపాదకీయం

ఏకపక్షానికి ముకుతాడు

వివాదాస్పదమైన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం - 2025లోని కొన్ని కీలక సెక్షన్లను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు సోమవారం నాడు వెలువరించిన మధ్యంతర తీర్పు ఏకపక్షంగా ముందుకెళుతున్న మోడీ సర్కారుకు గట్టి ముకుతాడు. ముస్లింల మేలు కోసమే ఈ చట్ట సవరణ చేపట్టామని గట్టిగా సమర్థించుకున్న ఎన్‌డిఎ ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ గత ఏప్రిల్‌లో 72 పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు వాటిని విచారణకు స్వీకరించి, కేంద్రం నుంచి వివరణ కోరినప్పుడు- ఆ పిటిషన్లకు విచారణార్హతే లేదని మోడీ ప్రభుత్వం తన అఫిడవిట్‌లో పేర్కొంది. చట్టం అమలుపై ఎట్టి పరిస్థితుల్లోనూ స్టే ఇవ్వరాదని, అది శాసనాధికారాల్లో కోర్టులు అనవసర జోక్యం చేసుకోవటమే అవుతుందని దూకుడుగా వాదించింది. కానీ, సుప్రీం ధర్మాసనం వాటిని తోసిపుచ్చింది. రెండు వైపులా సుదీర్ఘమైన వాదనలు విన్నది. వక్ఫ్ అధికారాల్లో మితిమీరిన జోక్యం చేసుకోవటానికి వీలున్న కొన్ని కీలకమైన అంశాలపై స్టే విధించింది. ప్రతిపక్ష పార్టీలూ, వక్ఫ్ పరిరక్షణ సంస్థలూ ఈ మధ్యంతర తీర్పును స్వాగతించగా; చట్టం మొత్తాన్ని నిలిపివేయకపోవడం ప్రభుత్వ విజయమేనని బిజెపి చెప్పుకొంది.

అన్ని మతాల వలె ఇస్లాంలోనూ ధార్మిక అవసరాలకు ఉపయోగించటానికి ఆయా కాలాల్లో ప్రజలూ, పాలకులూ భూములను, ఇతర ఆస్తులను దానం (వక్ఫ్) ఇవ్వటం ఆనవాయితీగా ఉంది. ఈ విధంగా సమకూరిన ఆస్తులు ముస్లిం పెద్దలతో కూడిన వక్ఫ్ బోర్డు సంరక్షణలో ఉంటాయి. ఉద్దేశిత అవసరాలకు వాటిని వినియోగించే పూర్తి హక్కు, అధికారమూ ఆ బోర్డు కలిగి ఉంటుంది. లక్షలాది ఎకరాలు వక్ఫ్ బోర్డుల ఆధీనంలో ఉన్నాయని, ఇది చాలా అన్యాయమని బిజెపి, దాని పరివార సంఘాలూ చాలా ఏళ్లుగా దుష్ప్రచారం చేస్తున్నాయి. అందుకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణ చేపట్టి, కొన్ని అభ్యంతరకరమైన నిబంధనలను చేర్చింది. ఈ చట్ట సవరణలు ఏకపక్షంగానూ, వివక్షతోనూ ఉన్నాయని ప్రతిపక్ష పార్టీలు, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర సంస్థలూ తీవ్రంగా వ్యతిరేకించాయి. 1923 నుంచి అమల్లో ఉన్న వక్ఫ్ బోర్డు చట్టాలను, నిబంధనలను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర తీర్పు ఇస్తున్నట్టు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆస్తిని దానం చేసే వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లామ్‌ని పాటించి ఉండాలనే నిబంధన మీద సుప్రీం స్టే విధించింది. ఇస్లాం అవలంబనను ఏ విధంగా గుర్తిస్తారో విధి విధానాలు రూపొందించేదాకా దాని అమలు నిలిపేయాలని పేర్కొంది. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతర సభ్యుల సంఖ్య కేంద్ర బోర్డుల్లో నాలుగు, రాష్ట్ర బోర్డుల్లో మూడు మించరాదని చెప్పి, ముస్లిం సభ్యులే మెజారిటీ ఉండాలని స్పష్టపరిచింది, బోర్డు ఛైర్మన్‌గా వీలైనంత మేర ముస్లింనే నియమిస్తే మంచిదని సూచించింది. వక్ఫ్ వివాదాల్లో సవరణ చట్టం జిల్లా కలెక్టరుకు దఖలు పర్చిన అధికారాలను ధర్మాసనం పూర్తిగా నిలిపివేసింది. ఏ కార్యనిర్వాహక అధికారీ తీర్పులు ఇవ్వజాలడని, అది అధికారాల విభజన చట్టానికి విరుద్ధమని నొక్కి వక్కాణించింది. తద్వారా, వక్ఫ్ భూముల వివాదాలు చాలాచోట్ల ప్రభుత్వంతోనే ముడిపడి ఉన్నందున, కలెక్టరుకు నిర్ణయాధికారాలు అప్పగిస్తే అది అన్యాయానికి తావిస్తుందన్న పిటిషనర్ల వాదనను బలం చేకూరింది. వక్ఫ్ భూములు లేదా ఇతర ఆస్తులు కొన్ని సందర్భాల్లో ఎలాంటి అధికార పత్రాలూ లేకుండానే బోర్డుకు దఖలు పడతాయి. అన్నింటినీ రిజిస్ట్రేషన్ పరిధిలోకి తీసుకురావాలన్న సవరణ చట్టం నిబంధనను ధర్మాసనం బలపర్చింది. వక్ఫ్ బై యూజ్ తొలగింపును సమర్థించింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం వెలువరించిన ఈ 128 పేజీల మధ్యంతర తీర్పు ... కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష ధోరణిని, పక్షపాత వైఖరిని వేలెత్తి చూపిందనటంలో సందేహం లేదు. గత ఏప్రిల్ రెండో తేదీన వాదోపవాదాల మధ్య అర్ధరాత్రి రెండున్నర గంటల సమయంలో బిల్లును ఆమోదించటం, వెంటనే రాష్ట్రపతి గెజిట్ విడుదల చేసి, అమల్లోకి తేవటం, చట్టంపై ఊరూరా ప్రచారం చేయాలని పిలుపునివ్వటం ద్వారా రాజకీయ ఎజెండాగా దానికి బిజెపి ఎంతటి ప్రాధాన్యాన్ని ఇస్తున్నదో అర్థమవుతోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పు ప్రజాస్వామ్య వాదులకు, సెక్యులర్ శక్తులకు కొత్త బలాన్నిచ్చింది. తుది తీర్పు కూడా ఇదే స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆశిద్దాం.



ఏ అభిప్రాయాన్ని అయినా తిరస్కరించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ దాని వ్యక్తీకరణను నిరోధించే హక్కు ఎవరికీ లేదు.

- పెరియార్
ఇ.వి. రామస్వామి,
నాస్తికవాది, సంఘసంస్కర్త.

జననం :17.9.1879
మరణం : 24.12.1973

అంతర్జాతీయం

నేపాల్ పరిస్థితిపై ఐదు అంచనాలు



విజయ్ ప్రసాద్
ట్రైకాంటినెంటల్: ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ రీసెర్చ్ డైరెక్టర్

అతుల్ చంద్ర
ట్రైకాంటినెంటల్ ఆసియా కార్యక్రమానికి కో-ఆర్డినేటర్

నేపాల్ యువత చేపట్టిన భారీ నిరసనల నడుమ దేశ ప్రధాని కె.పి.ఓలి రాజీనామా, ఆ తర్వాత నెలకొన్న సంక్షోభానికి మూలమైన వాస్తవ పరిస్థితులను అతిగా సాధారణీకరించి, తప్పుగా చూపించే అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి.

సెప్టెంబర్ మొదట్లో నేపాల్‌లో సంక్షోభం తీవ్ర రూపం దాల్చి, మధ్యేవాద ప్రభుత్వం కూలిపోయింది. సెప్టెంబర్ 4న సోషల్ మీడియాను నియంత్రించడం, నిషేధించడం దీనికి ప్రత్యక్ష కారణం. ఇందుకుగాను నిరసనలు వ్యక్తం చేసిన ప్రజలపై పోలీసులు కాల్పులు జరపడంతో 19 మంది మరణించారు. ఆ తర్వాత నిరసనలు మరింత బలంగా పెరిగి, రాజకీయ నాయకుల ఇళ్లపై, జాతీయ పార్లమెంట్ భవనంపై, అలాగే అధ్యక్ష భవనంపై దాడులు జరిగాయి.

ప్రస్తుత పరిస్థితి గురించి అనేక కథనాలు వినిపిస్తున్నా, రెండు ప్రధాన అభిప్రాయాలు ఉన్నాయి.

వ్యవస్థాపరమైన పాలనా వైఫల్యం: అనేక సంవత్సరాలుగా నెరవేరని హామీలు, అవినీతి, అవకాశవాద రాజకీయ కూటములు కలిసి వ్యవస్థ మొత్తం మీద ఒక చట్టబద్ధతా సంక్షోభాన్ని సృష్టించాయి. ఈ రోజు జరుగుతున్న తిరుగుబాటును ప్రజల అసంతృప్తి, వారి పట్ల కనబరచిన నిర్లక్ష్యానికి ప్రతిస్పందనగా అర్థం చేసుకోవాలి.

'కలర్ రివల్యూషన్' సిద్ధాంతం: ఈ నిరసనలను విదేశీ శక్తులు ప్రేరేపించాయి. ముఖ్యంగా అమెరికా, అమెరికా కాంగ్రెస్‌కు చెందిన 'నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసీ' సంస్థ ద్వారా 2015లో స్థాపించిన 'హమీ నేపాల్'కు నిధులు అందాయనే ఆరోపణలు ఉన్నాయి.

ఈ రెండు సిద్ధాంతాలు నేపాల్ లోని రాజకీయ వర్గాలకు తమ బాధ్యత నుంచి తప్పించుకోవడానికి సులువైన మార్గాన్ని ఏర్పరుస్తాయి - ఒకవేళ విదేశీ జోక్యాన్ని నిందించడం ద్వారా కానీ లేదా అస్పష్టమైన 'రాజకీయ వర్గం' అని చెప్పడం ద్వారా కానీ ఈ సిద్ధాంతాలు నేపాల్ లోని వాస్తవ సమస్యలను (శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆధిపత్య ఆర్థిక వ్యవస్థను, భూమి, ఆర్థిక వనరులు, ప్రభుత్వ ఒప్పందాలు రాజ వంశానికి దగ్గరగా ఉన్న కొద్దిమంది చేతుల్లో ఉండటం, అలాగే వలస కూలీల ఎగుమతులు-ఐ.ఎం.ఎఫ్ అప్పుపై ఆధారపడి నడిచే అభివృద్ధి నమూనాను) చర్చలోకి తీసుకు రావు. ప్రజల అసంతృప్తికి మూలమైన ఈ నిర్మాణ సమస్యలను 'అవినీతి', 'కలర్ రివల్యూషన్' అనే సులభమైన పదాలుగా మార్చి చూపిస్తారు.

ఈ సిద్ధాంతాలు పూర్తిగా సరైనవీ కావు, తప్పుడువీ కావు (అవి పాక్షికమైనవి. కానీ అవి తప్పుదారి పట్టించేలా ఉంటాయి). ఈ వ్యాసం ఆ అసమగ్రతను పూర్తిగా సరిచేయలేకపోయినా, కొన్ని ఆలోచనలను చర్చ కోసం మీ ముందుంచుతుంది. కింద ప్రస్తావించే ఐదు ప్రతిపాదనలు నేపాల్‌లో మాత్రమే కాకుండా, గ్లోబల్ సౌత్ లోని అనేక దేశాల భవిష్యత్తుపై చర్చకు ఒక పునాది వేసేందుకు ఉపకరిస్తాయి.

అంచనా 1: అవకాశాన్ని వృథా చేసుకోవడం

2015లో నేపాల్ కొత్త రాజ్యాంగాన్ని అమలు చేసిన తర్వాత, వామపక్షం ఆధ్వర్యంలో ప్రజల సామాజిక పరిస్థితులు మెరుగు పడతాయని భారీగా ఆశలు పెంచుకున్నారు. అందుకే 2017లో వివిధ కమ్యూనిస్టు పార్టీలు జాతీయ పార్లమెంట్‌లో 75 శాతం స్థానాలు గెలిచాయి. తర్వాతి సంవత్సరం, ప్రధాన కమ్యూనిస్టు పార్టీలు కలిసి నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీని ఏర్పాటు చేశాయి. అయితే, ఈ ఐక్యత లోతైనది కాదు. ఎందుకంటే ప్రతి పార్టీకి తాము అనుసరించే ప్రత్యేక నిర్మాణాలు, కార్యక్రమాలు ఉండటంతో, నిజమైన ఏకీకృత పార్టీగా మారలేకపోయాయి. అది కేవలం ఎన్నికల కూటమిగా మాత్రమే మిగిలింది.

2021లో ఏకీకృత పార్టీ చీలిపోయింది. ఆ తర్వాత, వివిధ వామపక్ష పార్టీలు వరుసగా అధికారంలోకి వచ్చాయి. కానీ ప్రజలు దానిని అవకాశవాదంగా భావించారు. 2023-2024లో మావోయిస్టు సెంటర్‌కు చెందిన హోం మంత్రి నారాయణ కాజీ శ్రేష్ట, ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి తన సొంత పార్టీలోని అవినీతి కేసులను విచారించడానికి ప్రయత్నించగా, ఆయనను పదవి నుండి తప్పించారు. కె.పి.ఓలి నాయకత్వం లోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (యునైటెడ్ మార్క్సిస్టు లెనినిస్టు) ప్రచండ నాయకత్వంలోని మావోయిస్టు పార్టీతో తెగతెంపులు చేసుకుని నేపాల్ కాంగ్రెస్ పార్టీతో కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఈ సంకీర్ణ ప్రభుత్వమే కుప్పకూలిపోయింది.

1951 విప్లవంతో ప్రారంభమైన ప్రజాస్వామ్య పోరాటం, 1990 జనాందోళనతో మరింత బలపడింది. 2006లో లోక్‌తంత్ర ఆందోళనతో స్థిరపడినట్లు అనిపించింది. కానీ ఇప్పుడు అది పరాజయం పాలైనట్లు కనిపిస్తోంది. అయితే, వాస్తవానికి ఆ దీర్ఘకాల పోరాటం మరో రూపంలో పునరావృతం అవుతున్నది.

ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం. 2015లో నేపాల్ కొత్త రాజ్యాంగాన్ని స్వీకరించినప్పుడు, దేశం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. గోర్ఖా ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం వల్ల పది వేల మందికి పైగా మరణించారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కనీసం నాలుగో వంతు నేపాలీలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. కులం, జాతి వివక్ష సమాజంలో తీవ్ర నిరాశను కలిగించింది. ప్రత్యేకంగా అసమానతలతో బాధపడుతున్న మధేశ్ ప్రాంత ప్రజలు... 2015 రాజ్యాంగం తమను మరింత మూలకు నెట్టివేసిందని భావించారు. బలహీనంగా వున్న ప్రభుత్వ ఆరోగ్య, విద్యా వ్యవస్థలు కొత్త మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చలేకపోయాయి.

అంచనా 2: ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం

2015లో నేపాల్ కొత్త రాజ్యాంగాన్ని స్వీకరించినప్పుడు, దేశం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోంది. గోర్ఖా ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపం వల్ల పది వేల మందికి పైగా మరణించారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. కనీసం నాలుగో వంతు నేపాలీలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. కులం, జాతి వివక్ష సమాజంలో తీవ్ర నిరాశను కలిగించింది. ప్రత్యేకంగా అసమానతలతో బాధపడుతున్న మధేశ్ ప్రాంత ప్రజలు... 2015 రాజ్యాంగం తమను మరింత మూలకు నెట్టివేసిందని భావించారు. బలహీనంగా వున్న ప్రభుత్వ ఆరోగ్య, విద్యా వ్యవస్థలు కొత్త మధ్యతరగతి ఆకాంక్షలను నెరవేర్చలేకపోయాయి. వామపక్ష ప్రభుత్వాలు ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు కొన్ని విధానాలను తీసుకువచ్చాయి. వాటి ఫలితంగా, పేదరికం నుండి అనేక వర్గాలు బయటపడ్డాయి. విద్యుత్ అందుబాటు 99 శాతానికి చేరింది. మానవాభివృద్ధి సూచికలో మెరుగుదల కనిపించింది. అయినా, ప్రజల ఆకాంక్షలు, ఆశలు, వాస్తవ పరిస్థితుల మధ్య భారీ అంతరం ఏర్పడింది. అసమానతలు తగ్గలేదు. వలసలు ఆందోళనకరంగా పెరిగాయి. అవినీతి స్థాయిలు అధికంగానే ఉన్నాయి (2024లో అవినీతి అవగాహన సూచికలో 107వ స్థానంలో వుంది). ఐ.ఎం.ఎఫ్ ఒప్పందాల కారణంగా ప్రభుత్వ ఆర్థిక స్వేచ్ఛ మరింత తగ్గింది.

అంచనా 3: హిందూ రాజరికానికి తిరిగి మళ్ళాలనే ఆకాంక్ష

ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో తమ పిల్లలను చదివించే, వెనుకబడిన కులాల పెటీ బూర్జువా వర్గం... ఉన్నత కులాల ఆధిపత్యంతో విసిగిపోయింది. వీరు భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ హిందుత్వ రాజకీయాల నుండి ప్రేరణ పొందారు. అందుకే, నిరసనల్లో యోగి ఆదిత్యనాథ్ ఫొటోలతో పోస్టర్లు కన్పించాయి.

ఈ వర్గం మళ్లీ రాజరికానికి, హిందూ రాజ్యానికి తిరిగి వెళ్లాలని కోరుకుంటోంది. ఆర్.పి.పి, శివసేన నేపాల్, విశ్వ హిందూ మహాసభ వంటి శక్తులు ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాయి.

1990ల నుండి హెచ్.ఎస్.ఎస్ (హిందూ స్వయంసేవక్ సంఘ్) నేపాల్‌లో నిశ్శబ్దంగా తన శక్తిని పెంచుకుంది. ఇవన్నీ కలిసి, లౌకిక విధానాలకు వ్యతిరేకంగా, హిందూ రాజ్య పునరుద్ధరణ కోసం ఉద్యమిస్తున్నాయి. అవినీతి వ్యతిరేకత, దాతృత్వం అనే డొల్ల వాదనలతో ఇవి అణగారిన కులాల వారికి చేరువ అవుతున్నాయి.

యువత బలహీనంగా ఉన్న సమయంలో, ఈ బలమైన శక్తులు హిందూ రాజ్యం పేరుతో అధికారాన్ని స్వాధీనం చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయి.

అంచనా 4: వలసలు పోవాల్సి రావడంపై విసుగు

ఉద్యోగాల కోసం అత్యధికంగా వలస వెళ్తున్న దేశాల్లో నేపాల్ ఒకటి. ప్రస్తుతం 5,34,500 మంది విదేశాల్లో పని చేస్తున్నారు. 2000 సంవత్సరంలో వలస వెళ్లేవారు 55,000 మాత్రమే ఉండగా, ఇప్పుడు పది రెట్లు పెరిగారు. 2022-23లో 7,71,327 అనుమతులు జారీ అయ్యాయి.

యువతకు దేశంలో ఉద్యోగాలు దొరకక, అమానుషమైన పనుల కోసం సైతం విదేశాలకు వెళ్ళాల్సి వస్తోంది. 2025లో దక్షిణ కొరియాలో తుల్సీ పున్ మాగర్ ఆత్మహత్య ప్రజలలో ఆగ్రహాన్ని రేపింది. గత ఐదేళ్లలో అక్కడ 85 మంది నేపాలీలు మరణించగా, వారిలో సగం మంది ఆత్మహత్య చేసుకున్నారు.

ఈ తరహా ఘటనలు ప్రభుత్వంపై అసహనాన్ని పెంచాయి. ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారుల పట్ల చూపుతున్న శ్రద్ధ, వలస కూలీల పట్ల చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి, వలస కూలీలు పంపే డబ్బు దేశానికి వచ్చే ఏ విదేశీ పెట్టుబడి కంటే కూడా ఎక్కువే వుంటుంది.

అంచనా 5: అమెరికా, భారతదేశ ప్రభావాలు

కె.పి.ఓలి ప్రభుత్వం అమెరికాతో దగ్గరగా వ్యవహరిస్తూ వచ్చింది. నేపాల్ 2017లో అమెరికా ప్రభుత్వ మిలీనియమ్ చాలెంజ్ కార్పొరేషన్ (ఎమ్.సి.సి) లో చేరింది. ఒత్తిడి కారణంగా నేపాల్ ప్రభుత్వం దీనికి కొంత కాలం దూరంగా ఉన్నప్పటికీ, 2025లో అమెరికా సహాయం పున:ప్రారంభమై, మౌలిక వసతులపై చర్చలు జరిగాయి.

భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం నేపాల్‌లో హిందూ జాతీయవాద పార్టీకి బలం చేకూర్చడానికి ప్రయత్నించింది. 2025 నిరసనల్లో బాహ్య ప్రభావం ఉందంటే, అది అమెరికా కంటే భారతదేశం తరఫు నుండే జరిగే అవకాశం ఎక్కువ. ఆర్.పి.పి కార్యాలయాలు దాడికి గురికాలేదు కానీ కమ్యూనిస్టు కార్యాలయంపై దాడి జరిగింది. ఇది సెప్టెంబర్ పరిణామాలకు సంకేతం.

సైన్యం కొంత మేరకు శాంతిని పునరుద్ధరించినా, అది అశాంతితో కూడిన శాంతి మాత్రమే. తర్వాత ఏం జరుగుతుందోననే అనిశ్చితి ఉంది. (వ్యాసం రాసే సమయానికి) తాత్కాలిక నాయకులుగా బలేంద్ర షా, సుశీలా కర్కీ పేర్లు వినిపిస్తున్నాయి. కానీ ఇవి ప్రజాస్వామ్యంపై నిరాశ పెంచే తాత్కాలిక పరిష్కారాలు మాత్రమే. కొత్త ప్రధానమంత్రి రావడం నేపాల్ సమస్యలను పరిష్కరించదు.

/ 'పీపుల్స్ డిస్పాచ్' సౌజన్యంతో/

వ్యాఖ్య

చార్లీ కిర్క్ హత్య - కొన్ని అంశాలు!



ఎం. కోటేశ్వరరావు

అమెరికా జనాభా 35 కోట్లు, తుపాకులు 50 కోట్లు, పెద్ద వారి దగ్గర సగటున 1.93 ఉన్నట్లు అంచనా. వాటిలో ఒక దానికి మూడు పదుల వయస్సున్న ఒక విశ్లేషకుడు, విద్వేష మితవాద ప్రచారకుడు చార్లీ కిర్క్ బలయ్యాడు. రోజుకు అమెరికాలో సగటున 131 మంది తుపాకులకు సమిధలవుతున్నారు. అలాంటి స్వేచ్ఛా గడ్డ మీద గుండె మీద చేయి వేసుకొని రోడ్ల మీదకు రావాలంటే రాజకీయ నేతలు భయపడుతున్నారు. భిన్న భావజాలం కలిగినవారి చేతుల్లో బలయ్యే స్థితి అమెరికాలో ఉంది. కిర్క్ హత్యపై అమెరికా, భారత్‌తో సహా యావత్ ప్రపంచ మీడియా గుండెలు బాదుకొంటోంది. అతడిని రెండు పదుల వయస్సు దాటిన టేలర్ రాబిన్సన్ అనే యువకుడు సెప్టెంబరు పదవ తేదీన కాల్చి చంపాడు. 31 ఏళ్ల కిర్క్ తన మిత్రుడు అంటూ 79 ఏళ్ల అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందనతో పెద్ద ప్రచారం, చర్చ జరుగుతున్నది. ఈ నెల 21 కిర్క్ అంత్యక్రియలకు డోనాల్డ్ ట్రంప్ హాజరు కానున్నాడు. దేశవ్యాపితంగా జాతీయ పతాకాన్ని అవనతం చేయాలని ఆదేశించాడు. ఇంత జరుగుతున్న తరువాత మితవాద శక్తులు, వాటికి మద్దతు ఇచ్చే మీడియా పెద్దలు ఆగుతారా? అందులోనూ మితవాద, కార్పొరేట్, పురోగామి భావాల వ్యతిరేక మీడియా ప్రపంచ వ్యాపితంగా రెచ్చిపోతున్న రోజులివి. కిర్క్ హత్యతో సంబరాలు చేసుకున్న విదేశీయుల వీసాలను రద్దు చేస్తామని ట్రంప్ బృందం హెచ్చరించింది. వామపక్ష తీవ్రవాదులే హత్యకు కారకులని, వారి అంతు చూస్తామని ఉపాధ్యక్షుడు జె.డి వాన్స్ బెదిరింపులకు దిగాడు. ముందుగా ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. ఏ భావజాలానికి చెందిన వారినైనా వ్యక్తిగతంగా హత్యకావించటం సమర్థించకూడదు. అది భావదారిద్ర్యం, సరకులేని బాపతు చేసే పని. యావత్ ప్రపంచంలో మితవాదం మీద భావజాల పోరు ఈనాటిది కాదు. పురోగామి శక్తులు అన్ని విధాలుగా సన్నద్ధంగానే ఉన్నాయి. కిర్క్‌ను రాబిన్సన్ ఉద్రేకంతో చంపినట్లు కనిపిస్తున్నది.

చార్లీ కిర్క్ పచ్చి మితవాది, మీడియా రంగంలోనే ఉన్నాడు. తీవ్రవాద భావాలతో ఉన్న వామపక్షవాదులు అద్భుతమైన చార్లీ కిర్క్ వంటి అమెరికన్లను నాజీలు, ఫాసిస్టులు, సామూహిక హత్యలు చేసేవారు, నేరగాళ్లుగా వర్ణిస్తున్నట్లు ట్రంప్ ఆరోపించాడు. అమెరికాలో ఏం జరుగుతోంది? ఎవరు ఎవరిని చంపుతున్నారు. యాంటీ డిఫమేషన్ లీగ్ అనే సంస్థ పదేళ్ల నాటి పరిణామాల గురించి 2022లో ఒక అధ్యయనం జరిపింది. మూడింట రెండు వంతులకు పైగా హత్యలు మితవాదులు చేసినవే అని తేలింది. మన దేశంలో మితవాద భావజాలాన్ని, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిని జాతి వ్యతిరేకులు, తుకడే తుకడే గాంగ్, కుహనా లౌకికవాదులు, అర్బన్ నక్సల్స్ అంటూ ముద్ర వేసినట్లుగానే అమెరికాలో కూడా తీవ్రవాద వామపక్ష వాదులని, మరొకటిగా చిత్రించి వాళ్లను చంపినా ఫరవాలేదన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. చంపివేస్తున్నారు. న్యూయార్క్ మేయర్ పదవికి పోటీ చేస్తున్న డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమదానీ తాను కమ్యూనిస్టును కాదని పదే పదే చెప్పినా డోనాల్డ్ ట్రంప్ పక్కా కమ్యూనిస్టు అంటూ ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే. జోహ్రాన్ డెమోక్రటిక్ సోషలిస్టు గనుక అలా అన్నాడని అనుకుందాం. జో బైడెన్ గెస్టపో పాలన కొనసాగిస్తున్నాడని ట్రంప్ ఆరోపించాడు. గెస్టపో అంటే హిట్లర్ నాజీ పాలనలో ప్రత్యర్థులను మట్టుపెట్టే రహస్య పోలీసు దళం. అలాంటపుడు జో బైడెన్ ఫాసిస్టు అయినట్లా? మన దేశంలో మత, కుల దురహంకారాలు ఉన్నట్లే అమెరికాలో జాత్యంహకారం ఉంది.



2021లో ట్రంప్‌కు మెజారిటీ వచ్చిన పదింటిలో ఎనిమిది రాష్ట్రాలలో తలసరి తుపాకి మరణాలు లక్షకు 33.9 ఉన్నాయి. డెమోక్రాట్లు బలంగా ఉన్న మసాచుసెట్స్‌లో 3.4గా ఉంది. సామూహిక తుపాకి హత్యలు ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయంటే మితవాదులు ఎక్కువగా ఉన్న చిన్న పట్టణాల్లో ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. రిపబ్లికన్ల తుపాకి విధానాలు వారినే బలి తీసుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు.

చార్లీ కార్క్ హత్య జరిగింది ఎక్కడ? మితవాదుల అడ్డాగా ఉన్న అటా వ్యాలీ విశ్వవిద్యాలయంలో. తుపాకీ సంస్కృతి ఎక్కడ మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నదంటే మితవాదులు ఎక్కువగా ఉన్న రెడ్ రాష్ట్రాలలో అన్నది జగమెరిగిన సత్యం. 2021లో ట్రంప్‌కు మెజారిటీ వచ్చిన పదింటిలో ఎనిమిది రాష్ట్రాలలో తలసరి తుపాకి మరణాలు లక్షకు 33.9 ఉన్నాయి. డెమోక్రాట్లు బలంగా ఉన్న మసాచుసెట్స్‌లో 3.4గా ఉంది. సామూహిక తుపాకి హత్యలు ఎక్కడ ఎక్కువగా జరుగుతున్నాయంటే మితవాదులు ఎక్కువగా ఉన్న చిన్న పట్టణాల్లో ఇటీవలి కాలంలో బాగా పెరిగాయి. రిపబ్లికన్ల తుపాకి విధానాలు వారినే బలి తీసుకుంటున్నాయంటే అతిశయోక్తి కాదు. తుపాకి హింసాకాండను అరికట్టేందుకు కేటాయించిన బడ్జెట్‌లో ఈ ఏడాది ట్రంప్ యంత్రాంగం 15.8 కోట్ల డాలర్ల కోత పెట్టింది. మితవాదుల పట్ల అమెరికాలో ఎంత వ్యతిరేకత ఉందంటే కార్క్ హత్య వార్త వెలువడగానే కొందరు సైనికులు పండగ చేసుకున్నారని వార్తలు రాగా వారి సంగతి చూడాలంటూ రక్షణ మంత్రి హెగసేత్ ఆదేశించాడు. సామాజిక మాధ్యమంలో సాయుధ దళాలకు చెందిన వారితో సహా ఉద్యోగులు, టీచర్లు, ప్రొఫెసర్లు ఇంకా అనేక మంది హర్షం వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారంటే చార్లీ కిర్క్ మీద ఉన్న ఆగ్రహానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

ఐరోపా, అమెరికాలో ఇటీవలి కాలంలో పచ్చి మితవాదులు, వారిని వ్యతిరేకించేవారి సమీకరణలు పెరుగుతున్నాయి. దీనికి ఒక ప్రధాన కారణం ఆర్థికంగా ఆయా దేశాలు అనేక సమస్యలను ఎదుర్కోవటం. ఇలాంటి పరిస్థితి ఉన్నపుడు మూఢభక్తి, మితవాద భావనలు పెరగటానికి అవకాశాలు ఉంటాయి. మన దేశంలో సాంస్కృతిక సారథుల పేరుతో సంఘపరివార్‌కు చెందిన వారు ఎలా తయారువుతున్నారో అమెరికాలో చార్లీ కిర్క్ కూడా యుక్త వయస్సు నుంచే మితవాద భావజాల సైనికుడిగా తయారయ్యాడు. ఫాక్స్ న్యూస్ వంటి మీడియా సంస్థలు అలాంటి వారిని వామపక్ష భావజాలంపై దాడికి వినియోగించాయి. మన దేశంలో కూడా అలాంటి ధోరణులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. అందుకే కిర్క్ హత్య తరువాత అలాంటి శక్తుల మీద సామాజిక మాధ్యమంలో అలాంటి వారికీ అదే గతి పడుతుంది లేదా పట్టాలని స్పందించారు, వీటి నుంచి అందరూ గుణపాఠాలు తీసుకోవాల్సి ఉంది.

సందర్భం

కొత్త బాటల 'తాతాజీ'

తాతాజీగా సాహిత్య లోకానికి పరిచితులైన తాపీ ధర్మారావు తెలుగు సారస్వతాన్ని సుసంపన్నం చేసిన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. సాహిత్యం కవిత్వం, చిత్రలేఖనం, గణితం, నాటకాలు, వ్యాయామం ఇలా పలు అంశాల్లో ఆసక్తి కనబర్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి. వేగుచుక్క గ్రంథమాల వ్యవస్థాపకులు. స్వతంత్ర పరిశోధకులు, సంఘ సంస్కర్త, మూఢ నమ్మకాలను చీల్చి చెండాడిన హేతువాది. సమదర్శని, కొండెగాడు, ప్రజా మిత్ర, జనవాణి, కాగడా వంటి పత్రికల ద్వారా ప్రజానీకానికి ప్రత్యామ్నాయ రాజకీయ భావాలను చేరువ చేసిన పాత్రికేయులు. పాత పాళీ నుంచి కొత్త పాళీ లోకి కొనసాగిన పాత కొత్తల మేలు కలయిక తాతాజీ. "ఆయన రాసింది చూసి నేర్చుకున్నాం" అని నార్ల అంతటి వ్యక్తే చెప్పగలిగిన సామర్థ్యం తాపీ వారి సొంతం. "ఉన్నది కన్నట్టు వ్రాయుటకన్న గవికి మేలు లేదు" అన్నాయన హేతువాద వైజ్ఞానిక దృక్పథాన్ని, ప్రశ్నించే స్వభావాన్ని ప్రచారం చేసిన తీరు అద్భుతం. దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు? ఇనుప కచ్చడాలు, పెళ్ళి - దాని పుట్టు పూర్వోత్తరాలు, తాతాజీ చేసిన ఈ మూడు రచనలు భావోద్యమాల చరిత్రని అనూహ్యంగా మలుపు తిప్పాయి. మానవ పురాచరిత్ర అధ్యయనం ద్వారా ఆయన శోధించి, వెల్లడించిన అనేక అపూర్వమైన విషయాలు, ఆయా రంగాల్లో ఎందరో అన్వేషకులకు, పరిశోధకులకు మార్గదర్శకంగా ఉపయోగ పడ్డాయి. తెలుగు సారస్వతాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఘనత నిస్సందేహంగా తాతాజీదే. ఇవి కాక ఆలిండియా అడుక్కు తినేవాళ్ళ మహాసభ, ఇంకా కొన్ని నాటికలు రాశారు. రాలూ, రప్పలూ పేరుతో ఆత్మకథ రాశారు. జన సామాన్యానికి చేరువయ్యే సరళమైన భాషకి పట్టం కట్టారు !

కందుకూరి, గురజాడ, గిడుగు వంటి వారి అడుగుజాడల్లో సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించిన ఉద్యమకారుడు తాతాజీ. చల్లపల్లిరాజా వారి కుమారుడి అక్షరాభ్యాసం సందర్భంలో సాంప్రదాయ తంతుని నిరసిస్తూ "ఓం నమశ్శివాయ" మంత్రానికి బదులు "అ, ఆ" లే రాయించి అక్షరాభ్యాసం చేయించిన ధైర్యశాలి. వందల సంఖ్యలో ఆదర్శ వివాహాలు చేశారు. సొంత కుటుంబం నుండే ప్రజాతంత్ర భావాలకి గాను పెద్ద పీట వేశారు. వామపక్ష సానుభూతి పరుడిగా ఎదిగారు. టాల్‌స్టాయ్ రచన అన్నా కెరినాను తెలుగులోకి అనువదించారు. సాంస్కృతిక వికాసానికి తన వంతు కృషి చేసిన తాతాజీ చలనచిత్ర రంగంలో కూడా తన ముద్ర వేశారు. మాలపిల్ల, రైతుబిడ్డ, ఇల్లాలు, రోజులు మారాయి, కీలు గుర్రం, పల్లెటూరి పిల్ల, కృష్ణ ప్రేమ, పరమానందయ్య శిష్యుల కథ మొదలైన సినిమాలకి సంభాషణలు రాశారు. ఆంధ్రదేశంలో వెల్లువెత్తిన ప్రతీ నూతన ఆవిష్కరణనీ నిబద్ధతతో తన వంతు పరిపుష్టం చేశారు తాతాజీ. అందుకే ఆయన జయంతి సెప్టెంబరు 19ని తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుంటాం! మూఢత్వపు చీకట్లను చీల్చే ఆయన అక్షర కాంతుల సాయంతో తెలుగు సారస్వతాన్ని సమున్నతంగా నిలిపేలా కృషి చేయడమే ఆయనకి ఇవ్వదగ్గ నివాళి!

(సెప్టెంబరు 19 తాపీ ధర్మారావు జయంతి)

- డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య,
సెల్ : 9490400858

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు

- రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతా సిన్హా
- జనవరి 25 నుండి 28 వరకు హైదరాబాద్‌లో ఐద్వా 14వ జాతీయ మహాసభ
- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర్‌రామన్

సన్నాహక సమావేశంలో ప్రసంగిస్తున్న రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతా సిన్హా

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హక్కుల సాధనే లక్ష్యంగా పోరాటాలు నిర్వహించాలని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత ప్రొఫెసర్ శాంతాసిన్హా పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా జాతీయ మహాసభ కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాంతాసిన్హా మాట్లాడుతూ ఇంట గెలిచి రచ్చగెలవాలనే సామెత పాతబడిపోయిందని, ఇప్పుడు మహిళ బయట గెలిస్తేనే ఇంట్లో కూడా గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇంటి నుంచే సమానత్వం మొదలు కావాలని ఆకాంక్షించారు. మహిళల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న అంశాలపై ఉద్యమించాలని సూచించారు. పోరాడడం వల్లే మహిళలకు ఈ మాత్రం హక్కులైనా వచ్చాయన్నారు. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం దక్కినప్పుడే మహిళా అభివృద్ధి జరిగినట్టని తెలిపారు. మహిళా సాధికారత కోసం మహాసభల్లో తగిన నిర్ణయాలు చేయాలని సూచించారు.

మనుధర్మం మహిళా హక్కులకు వ్యతిరేకం

మనుధర్మం మహిళా హక్కులకు వ్యతిరేకమని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర్‌రామన్ తెలిపారు. దీనిని అమలు చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి కుట్రలు చేస్తున్నాయని వివరించారు. చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేస్తే మహిళలపై, బాలికలపై హింస తగ్గుతుందన్నారు. పాలకులు నేరస్తులకు కొమ్ముకాస్తున్న ఉదంతాలను ఆమె ఉదహరించారు. హైదరాబాద్‌లో వచ్చే ఏడాది జనవరి 25 నుంచి 28 వరకు ఐద్వా జాతీయ మహాసభ నిర్వహించనున్నామని, మహిళా సమస్యలపై చర్చించనున్నామని తెలిపారు. ఐద్వా జాతీయ కోశాధికారి పుణ్యవతి మాట్లాడుతూ మహిళలు పని ప్రదేశాల్లో లైంగిక దాడులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐద్వా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ జాతీయ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ మహిళలు ఉద్యమించాల్సిన అవశ్యకత ఏర్పడిందన్నారు. సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఐద్వా సీనియర్ నాయకులు జ్యోతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

ఐద్వా 14వ జాతీయ మహాసభ నిర్వహణకు ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. 75 మందితో ఆహ్వాన సంఘం ఏర్పడింది. చైర్‌పర్సన్‌గా డాక్టర్ శాంతా సిన్హా, గౌరవాధ్యక్షులుగా జూలకంటి రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లు లక్ష్మి, కోశాధికారిగా ఆర్ అరుణజ్యోతి, చీఫ్ ప్యాట్రన్లుగా తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ శివుల మంజులత, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, ఐద్వా వ్యవస్థాపకులు స్వరాజ్యమ్మ, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కె నాగేశ్వర్, ఎం.రామిరెడ్డి, తమ్మారెడ్డి భరద్వాజ, సుద్దాల అశోక్‌తేజ, ప్యాట్రన్లుగా మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితోపాటు మరో 11 మంది ఎన్నికయ్యారు.

'సజీవ చరిత్ర 1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబునాయుడు తదితరులు

దేశ రాజకీయాల్లో ఎన్‌టిఆర్ ఒక సంచలనం

సజీవ చరిత్ర పుస్తకావిష్కరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-కంకిపాడు

ఎన్‌టిఆర్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర కల సాకారం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని పోరంకిలో 'సజీవ చరిత్ర 1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రబాబునాయుడు విచ్చేసి మాట్లాడారు. దేశ రాజకీయాల్లో 1983 ఒక సంచలనమని, ఒక ప్రాంతీయ పార్టీ పెట్టి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన యుగపురుషుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. 1984లో జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం కూడా ఎప్పటికీ సజీవంగానే ఉంటుందన్నారు. టిడిపి ప్రభుత్వాలు తీసుకొచ్చిన పాలసీలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అమరావతిలో తెలుగు వైభవం పేరుతో ఎన్‌టిఆర్ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని, ఎన్‌టిఆర్ స్ఫూర్తితో పేదరికం లేని సమాజం సాధిస్తామని చెప్పారు. ఈ పుస్తకావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రి కొల్లు రవీంద్ర, నందమూరి రామకృష్ణ, టిడిపి నాయకులు టిడి జనార్ధన్, విక్రమ్ పూల ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు, సంస్కృత భాషలకు పూర్వ వైభవం : ఆర్‌డి విల్సన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : తెలుగు, సంస్కృత భాషలకు పూర్వ వైభవం తీసుకొస్తానని, అకాడమీ ద్వారా పరిరక్షణకు కృషి చేస్తానని తెలుగు, సంస్కృత భాషల అకాడమీ ఛైర్మన్ ఆర్‌డి విల్సన్ (శరత్‌చంద్ర) పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంపాదక, రచయితలు, భాషాభిమానులు ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. తెలుగు భాష, సాహిత్యంపై తనకున్న మక్కువతో వైద్యరంగాన్ని ఎంపిక చేసుకునే అవకాశం ఉన్నా తాను సాహిత్యం వైపే అడుగేసి సమాజాభివృద్ధికి దోహదపడే అనేక నవలలు, కథలు, నాటకాలు రచించినట్లు వెల్లడించారు. సమాజంపై ఉన్న బాధ్యతతో విలేకరిగా పనిచేశానన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్యసేవలకు తూట్లు పొడిచిన కూటమి : షర్మిల

అమరావతి బ్యూరో : ఎన్‌టిఆర్ వైద్య సేవలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచిందని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. ఆస్పత్రులకు ఏడాదిన్నర కాలంగా రూ.2,500 కోట్లు బకాయిలు పెట్టడాన్ని ఖండించారు. ఆస్పత్రులకు బిల్లులు వెంటనే చెల్లించి నిలిచిపోయిన ఎన్‌టిఆర్ వైద్య సేవలను పునరుద్ధరించాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బకాయిల భారంతో పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవల స్థానంలో యూనివర్సల్ ఇన్సూరెన్స్ పేరుతో ప్రభుత్వం చేసేది మోసమని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ప్రైవేటు బీమాతో ముడిపెట్టడం అంటే ప్రజారోగ్యానికి ఎసరు పెట్టడమేనన్నారు. దేశంలో ప్రైవేటు బీమా అమలు చేసిన 18 రాష్ట్రాల్లో 16 రాష్ట్రాలు ప్రభుత్వ ట్రస్ట్ విధానానికి మారాయని తెలిపారు. ప్రైవేటు బీమా భారం తప్ప లాభం కాదని ఒప్పుకున్నాయన్నారు.

అతిసారతో 30 మంది చికిత్స

మానవ వైఫల్యం కాదు వ్యవస్థల వైఫల్యం : బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ న్యూ ఆర్‌ఆర్‌పేటలో అతిసార బారిన పడిన వారిలో సుమారు 30 మంది జిజిహెచ్, కేర్ అండ్ షేర్ వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్నారు. 20 రోజులుగా కేసులు పెరుగుతున్నాయని కేర్ అండ్ షేర్ వైద్యులు తెలిపారు. ఈ నెల 10 నుంచి 15 వరకు నిర్వహించిన ఇంటింటి సర్వేలో 116 కేసులు నమోదయ్యాయన్నారు. గత ఏడాది వచ్చిన బుడమేరు వరదలకు డ్రైయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. వాటర్ పైప్‌లైన్లు దెబ్బతిని, లీకేజీల మయమైనా, మరమ్మతులు చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని 16 అపార్ట్‌మెంట్ల మధ్య ఖాళీ స్థలాలన్నీ దుర్గంధపూరితంగా మారాయని, యుజిడి వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని, ఇళ్లల్లోని వేస్ట్ వాటర్, వ్యర్థాలు ఈ అపార్ట్‌మెంట్స్ మధ్యలోనే డంప్ అవుతున్నాయని తెలిపారు. వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అతిసారపై సిఎం ఆరాతీయడం, ఆగ్రహం వ్యక్తం చేయడమే కాదని బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అతిసార మానవ వైఫల్యం కాదని, వ్యవస్థల వైఫల్యమని తెలిపారు. నీటిసరఫరా మెరుగుదలకు, పైప్‌లైన్‌ల మార్పిడికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని తక్షణమే నిర్వహించాలన్నారు.

IN THE COURT OF THE MVACT CUM II ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD

O.P.No. 2670 OF 2024

Between:
Shaik Ashrafun and others ...Petitioners
A N D
Kampa Nagaraju and Others ...Respondents

To,
Res-No.1:
Kampa Nagaraju, S/o. Kotaiah, Aged: Major, Occ: Business, R/o. H.No. 19-150, Brahmanandareddy Colony, Piduguralla, Palnadu Dist-522413.
Res-No.3:
Challa Srinivasa Rao, S/o. Challa Srihari, Aged: Major, Occ: Driver, R/o. 18-117/7, SP Colony, Piduguralla, Guntur Dist-522413

Please take notice that the above petitioner had filed the case for grant of compensation for the death of by name Dadapeer@Shaik Dadapeer in a motor vehicle accident which occurred on 12-10-2024 under the limits of **P.S. Piduguralla Town.**

The above case is posted to **16-10-2025 at 10.30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an Advocate, else the case will be decided exparte.

[BY ORDER OF THE COURT]

Sd/- **K. ANAND REDDY, D. VENKAT RAMANA,** Advocates,
Counsel for the Petitioners,
Off: Flat No. 212, Jamuna Towers, Opp:Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.
Cell: 9848052455, 9848051707

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

కంచికచర్ల బ్రాంచి (13751)
చెవిటికల్లు రోడ్డు సెంటర్, కంచికచర్ల, కృష్ణాజిల్లా. ఫోన్ నెం.9324913751. ఈ-మెయిల్: ubin0813753@unionbankofindia.bank

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9(1) సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

14	64/4	3.30	మెరక	పుసులూరి అచ్యుతరావు	82	64,65	60,82	రౌతుగూడెం	పామ్‌ఆయిల్, డ్రిఫ్ట్, బోర్,తాడి -100,వేప-6,టేకు-1, జామ్‌ఆయిల్-1, తునికి-1
15	63/5B	0.50	మెరక	పుసులూరి అచ్యుతరావు	83	64,66	60,83	రౌతుగూడెం	తాడి-28, పామ్ ఆయిల్
16	87-1	0.50	మెరక	యదల సత్యనారాయణ	39	99	37	86	--
17	87-1A	1.93	మెరక	కట్ట లీలా గంగాభవాని	39	99	37	86	--
18	87-1B	2.00	మెరక	వామిశెట్టి మంగతాయారు	39	99	37	86	--
19	92/1	2.83	మెరక	బొర్రా వెంకటేశ్వరరావు	81,77	97	91	93	బోర్-1,మోటార్-1,పామ్ -8,టేకు-1, వేప-2
20	92/2	2.00	మెరక	బొర్రా వెంకటేశ్వరరావు	81,78	97	91	93	--
21	97-2	4.79	మెరక	యదల సత్యనారాయణ	97/1	96	104	92	--
22	97-3	2.42	మెరక	యదల సత్యనారాయణ	97/1	96	104	92	--
23	101/3	1.70	మెరక	ఆచంట శ్రీనివాసరావు	87	112	102	110	తాడి-19
24	115/2C	1.18	మెరక	ఆచంట శ్రీనివాసరావు	101	123	112	110	--
25	115/1D	0.51	పల్లం	పిచ్చుకల సత్యనారాయణ	110	108	122	101	--
26	165/2A	0.39	పల్లం	పాలడుగుల వెంకటలక్ష్మి	109	162	178	144	టేకు-2
27	165-2B	0.69	పల్లం	పాలడుగుల వెంకటలక్ష్మి	109	162	178	144	--
28	178-1	1.00	పల్లం	మానికల అబ్బులు	165	212	179	177	--
29	189/1	1.36	మెరక	మళ్లబత్తుల సోమమ్మ	189/2	207	188	189/2	--
30	189/4	4.29	మెరక	మళ్లబత్తుల సోమమ్మ	పట్టణపాలెం	206	189/3	190	--
31	190/1	5.65	మెరక	కాసే దుర్గారావు	189	పుల్లెపూడి	199	190/2	--
32	190/2A	3.67	మెరక	దండబత్తుల కృష్ణవేణి	200	VB	192	189	--
33	192/3	0.87	మెరక	ఉజ్జు రామయమ్మ	194	191	362	190	--
34	192/4A	0.18	మెరక	ఉజ్జు రామయమ్మ	194	191	362	190	--
35	198/1	10.21	మెరక	కాసే కనకదుర్గ రావు	200	197	199	201	--
36	205/3	2.74	మెరక	మళ్లబత్తుల సోమమ్మ	205/2	205/4	203	207	--
37	241	5.00	మెరక	పుసులూరి భారతి	238	242,243	236	249	బోర్,డ్రిఫ్ట్,వేప-7,తాడి-18
38	245-1	1.81	మెరక	అల్లూరి శివకుమార్	346	343	344	343	--
39	246	2.00	మెరక	పుసులూరి అరుణ్‌కుమార్	255	275	247	261	--
40	248	1.25	మెరక	పుసులూరి రామరావు	255	247	249	246	--
41	248	1.25	మెరక	పుసులూరి ఉదయభాస్కర్	255	247	249	246	--
42	248	1.39	మెరక	అల్లూరి కృష్ణరావు	255	247	249	246	--
43	248	1.33	మెరక	అల్లూరి రవికుమార్	255	247	249	246	--
44	248	1.40	మెరక	అల్లూరి సత్యనారాయణ	255	247	249	246	--
45	248	1.39	మెరక	అల్లూరి కృష్ణకుమారి	255	247	249	246	--
46	255	4.00	మెరక	పుసులూరి అరుణ్‌కుమారి	256	246	250	259	--
47	256-1	1.06	మెరక	తుంపాటి సూర్యారావు	256	246	250	259	--
48	256/1	1.02	మెరక	తుంపాటి ఉదయభాను	256	246	250	259	--
49	256-7	2.50	మెరక	పుసులూరి సర్వారాయుడు	256	246	250	259	--
50	257/2A	0.50	మెరక	పిచ్చుకల సత్యనారాయణ	19	24	26	24	మామిడి-1
51	257/2A	0.50	మెరక	పిచ్చుకల గంగరాజు	258	256	259	VB	--
52	259	0.25	మెరక	పిచ్చుకల దుర్గరావు	258	261	255	260	టేకు-1,చింత-1, వెదురు-2,కానుగ-1
53	259	0.25	మెరక	పిచ్చుకల చిట్టిరాజు	257	261	255	260	--
54	259	2.00	మెరక	గద్దె రాజేష్	260	255	257	261	తాడి-2
55	264/1	1.23	మెరక	సోమగాని నాగదుర్గ	VB	274	263	245	తాడి-20
56	264/2A	1.00	మెరక	కాగిత గంగాభవాని	VB	274	263	245	జీడిచెట్లు-23,తాడి-30
57	269	3.50	మెరక	గద్దె దుర్గరావు	268	441	70	ములగలం పల్లిగ్రామం	--
58	269	1.50	మెరక	కొండెపాటి మాధవి	268	441	70	ములగలం పల్లిగ్రామం	--
59	287/5	2.00	పల్లం	మామిళ్ళపల్లి నాగశిరోమణి	287/3	286	307	287/4	--
60	288	3.75	మెరక	గన్నిన జస్వంత్ చౌదరి	235	304	291	290	పామ్ ఆయిల్ మొక్కలు-275 డ్రిప్,మామిడి-1,వేప-2,పామ్-65
61	288	3.70	మెరక	గన్నిన మోహన కృష్ణ సుమంత్ బాబు	235	304	291	290	పామ్ ఆయిల్ మొక్కలు-100 ధ్రుఫ్, పామ్‌మొక్కలు-24
62	290/1	1.32	మెరక	గద్దె లక్ష్మణ్‌రావు	243	288	288	277	--
63	290-2A	3.03	మెరక	తుంపాటి సూర్యారావు	243	288	288	277	--
64	306/1	0.47	పల్లం	మామిళ్ళపల్లి చినకోటేశరరావు	305	307	308	287	--
65	306/2	1.15	పల్లం	మామిళ్ళపల్లి చినకోటేశరరావు	305	307	308	287	--
66	306/2	1.15	పల్లం	మామిళ్ళపల్లి చినకోటేశరరావు	309	305	309	287	--
67	313/1A	1.00	పల్లం	మామిళ్ళపల్లి రాంబాబు	311	321	317	314	--
68	313/1B	2.80	పల్లం	మామిళ్ళపల్లి చినకోటేశ్వరరావు	314	421	315	311	--
69	313/1B	2.80	పల్లం	మామిళ్ళపల్లి చినకోటేశ్వరరావు	314	421	321	311	--
70	318/2P	1.30	పల్లం	ఊడ నాగరత్నం	317	320	405	321	--
71	322	1.25	పల్లం	పసుపులేటి శేషమని	314	355	323	321	--
72	338/1A	2.00	పల్లం	నందిన సుబ్బలక్ష్మి	337	351	354	339	--
73	342-1	4.96	పల్లం	గన్నిన సీత మహాలక్ష్మి	346	336	337	396	బోర్-2,పామ్ ఆయిల్‌మొక్కలు 215, మామిడి-1,వేప-4,షెడ్-1
74	344-1A	0.74	పల్లం	చిలకలముడి రామకృష్ణ	347	345	346	344/2	--
75	344-1A	0.73	పల్లం	చిలకలముడి సుధాకరరావు	347	345	346	344/2	--
76	347-1A	0.20	పల్లం	మానికల అబ్బులు	212	344	348	346	--
77	347-2C1	1.32	పల్లం	మానికల అబ్బులు	212	344	348	346	--
78	347-2C2	1.00	పల్లం	కుక్కల మణి	212	344	348	306	--
79	351	2.20	పల్లం	పిచ్చుకల గంగరాజు	351	354	361,360	350	--
80	352/1A	0.59	మెరక	నందిన సుబ్బలక్ష్మి	338	352/2	351	334	--
81	352/2A1	0.15	మెరక	నందిన సుబ్బలక్ష్మి	352/1	352/3	351	334	--
82	355-2A	1.15	మెరక	పిచ్చెటి సక్కుభాయి	212	344	348	306	--
83	386	1.50	మెరక	కోన వెంకటరావు	400	387	390	376	--
84	386	1.50	మెరక	జంగా గణపతి	400	387	390	376	--
85	400	24.29	పల్లం	కొల్లూరి సత్యవతి	319	399	377	404	--
86	403-1	1.57	పల్లం	పదల మంగతాయారు	405	402	404	406	--
87	404-2	0.23	పల్లం	బొరుసు గంగాపార్వతి	311	356	400	405	--
88	440-3	0.75	మెరక	కొండెపాటి మాధవి	280	439	281	441	--
89	440/3a	0.75	మెరక	గద్దె సోమరాజు	280	439	281	441	--
90	456	3.00	మెరక	పినిమిల్లి పార్వతి	444	457	455	ములగలం పల్లిగ్రామం	--
91	479/1A1	1.00	పల్లం	చామర్తి వెంకటనాగ వైష్ణవి గార్డియన్ చళ్ల నాగమణి	425	479-2	480	449	--
92	501	1.25	మెరక	మండపాటి అనంతలక్ష్మి	499	పుల్లెపూడి	500	499	--
93	501	2.44	మెరక	బోగిశెట్టి శ్రీ హరిలక్ష్మి	499	పుల్లెపూడి	500	499	--
94	520	5.00	మెరక	పినిమిల్లి పార్వతి	514	470	పుల్లెపూడి	519	--
	మొత్తం:	189.06							

సం/- **కె.ఆంజనేయులు**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వి.ఆర్.పురం యూనిట్-2, చింతూరు

సం/- **యస్.సరళావందనం**, భూసేకరణాధికారి మరియు
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

ప్రజా సమస్యలపై పోరాటాలు, ఆందోళనలు

• ట్రంప్ టారిఫ్ టెర్రరిజంపై నెలాఖరులో విస్తృత ప్రచారోద్యమం • దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ సమావేశాలు • సిపిఎం పిలుపు

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలపై సెప్టెంబరు చివరి వారంలో విస్తృత ప్రచారం చేపట్టాలని, దేశవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ సమావేశాలు నిర్వహించాలని, ప్రజల జీవనోపాధులకు సంబంధించిన సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టాలని రాష్ట్ర కమిటీలకు సిపిఎం పిలుపునిచ్చింది. హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఈ నెల 13-15 తేదీల్లో సమావేశమైన సిపిఎం కేంద్ర కమిటీ పలు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించి ఒక ప్రకటన జారీ చేసింది.

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు దేశాన్ని సంక్షోభం వైపునకు నెడుతున్నాయి. పెరుగుతున్న ధరలు, పెరగని వేతనాలు, తీవ్రమవుతున్న అసమానతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగం పెచ్చరిల్లుతోంది. ముఖ్యంగా అమెరికా టారిఫ్‌లు విధించిన తర్వాత పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

జులై 9న నిర్వహించిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసినందుకు దేశ కార్మిక లోకాన్ని కేంద్ర కమిటీ అభినందించింది. ఈ సమ్మెకు సంఘీభావం ప్రకటించిన రైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర వర్గాల వారిని కూడా ప్రశంసించింది. సార్వత్రిక సమ్మెను ఇంతగా జయప్రదం కావడం వెనుక కేంద్ర ప్రభుత్వ విధానాలపట్ల ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సాగే పోరాటాలకు సిపిఎం మద్దతు కొనసాగిస్తుంది.

ట్రంప్ టారిఫ్ టెర్రరిజం : భారత్‌పై 50శాతం సుంకాలను అమెరికా ప్రకటించింది. వీటిలో 25శాతం వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో విఫలమైనందుకు ప్రకటించగా, మరో 25శాతం రష్యా నుండి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్నం దుకువిధించారు. ఈ చర్య భారతదేశ వ్యవసాయాన్ని, మత్స్య పరిశ్రమను, ఎంఎస్‌ఎంఇలను, ముఖ్యంగా జౌళి పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీయనున్నాయి. మన దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా వాణిజ్య ప్రతినిధులు భారత్‌లో వున్నారు. అమెరికా ఒత్తిడికి బిజెపి ప్రభుత్వం లొంగిపోరాదు. మన రైతులు, కార్మికులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రయోజ నాలకు కట్టుబడి వుండాలి.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు/ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు : వరుసగా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడానికి ముందుగా వివిధ పక్షాలను ప్రభుత్వం సంప్రదించాలి, ప్రజలకు కలిగే ప్రయోజనాలను జాగ్రత్తగా అంచనా వేయాలి. వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవాలన్న తొందరపాటు వల్ల పాల ఉత్పత్తులు, వ్యవసాయం, రక్షణ, ఫార్మాస్యూటికల్స్, ఆర్థికం వంటి కీలక రంగాల్లో దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమే అవుతుంది.

కార్పొరేట్లకు రాయితీలు : దేశ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చేస్తున్న విఫల యత్నాల్లో భాగంగా కేంద్ర కేబినెట్ భారత కార్పొరేట్లకు అనేక రాయితీలను ఆమోదించింది. వివిధ పథకాల పేర్లతో దాదాపు రూ.1,50,000 కోట్ల మేరకు రాయితీలను ప్రకటించింది. ముసాయిదా జాతీయ టెలికం విధానం (ఎన్‌టిపి)-2025 ప్రైవేటు కంపెనీలకు రాయితీలను ప్రతిపాదించింది. కానీ ప్రభుత్వ రంగంలోని టెలికం కంపెనీల భవిష్యత్తును మాత్రం పట్టించుకోలేదు. బిజెపి ప్రభుత్వం ప్రైవేటు కార్పొరేషన్లకు ప్రజా వనరు లను బదిలీ చేస్తోందని, హిందూత్వ మతోన్మాద- కార్పొరేట్ బంధాన్ని మరింత బలోపేతం చేస్తోందన్న వాస్తవాన్ని ఈ పథకాలు గట్టిగా నొక్కి వక్కాణిస్తున్నాయి.

కార్మిక హక్కులపై దాడి : కార్మికులను మాత్రమే కాకుండా పర్యావరణాన్ని కూడా పరిరక్షించే వివిధ నియంత్రణ, ఆమోద ముద్ర నిబంధనలను బలహీన పరచడం ద్వారా కార్పొరేట్ల లూటీకి కేంద్రం వెసులు బాటు కల్పిస్తోంది. స్వాతంత్ర్యదినోత్సవం నాడు ప్రధాని మోడీ ప్రసంగించిన వెంటనే, దూకుడుతో కూడిన ఆయన నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగా, నియంత్రణా నిబంధనలను, సమ్మతిని తెలియచేసే నిబంధనలను నేరరహితం చేయడానికి రెండు ఉన్నత స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు నీతి అయోగ్ ప్రకటించింది. ఇది, కార్మిక వర్గ హక్కులకు తీవ్రమైన ఎదురుదెబ్బ.

జిఎస్‌టి రేటు సవరణ : ప్రభుత్వం జిఎస్‌టి కౌన్సిల్‌ను సమావేశపరిచి కొన్ని ఉత్పత్తులపై జిఎస్‌టి రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. అలాగే జిఎస్‌టి స్లాబ్‌లపై తిరిగి కసరత్తు కూడా చేపట్టినట్లు తెలిపింది. నిరుపేదలు, సామాన్యులు ఉపయోగించే వస్తువులు, సేవలపై పన్నును తగ్గించడం స్వాగతించదగ్గ చర్యే. అయితే ఈ తగ్గింపు ప్రయోజనాలు కార్పొరేట్ల కన్నా వినియోగదారులకు చేరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇందుకు అదనంగా, ఒకవేళ ఆదాయంలో నష్టమేమైనా వున్నట్లైతే కేంద్రం ఆ నష్టపరిహారాన్ని రాష్ట్రాలకు అందచేయాల్సి వుంటుంది. ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికి బదులుగా ప్రభుత్వం, ప్రజాస్వామ్య హక్కులను కుదించడానికి రాజ్యాంగ సంస్థలపై తనకు గల నియంత్రణను ఉపయోగించుకుంటోంది.

బలోపేతమవుతున్న నిరంకుశవాదం

ఎస్ఐఆర్ : బీహార్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పూర్తి ఉల్లంఘనలతో నిండి వుంది. ఫలితంగా అనేకమంది పౌరులకు రాజ్యాంగపరంగా హామీ కల్పించిన ఓటు హక్కు తొలగించబడింది. ఎన్ని కల కమిషన్ ఈ ప్రక్రియను ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాలని చూస్తోంది. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి అనుకూలంగా నిరంతరంగా వ్యవహ రిస్తూ వచ్చిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్/ సంఘపరివార్ ఎజెండాను ముందుకు తీసుకెళ్ళడంలో భాగస్వామిగా మారింది.

ఓటరు నమోదుకు గానూ ఆధార్ కార్డును చెల్లుబాటయ్యే పత్రంగా పరిగణించాలని ఎన్నికల కమిషన్‌ను సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలు అమలయ్యేలా, అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును ఉపయోగించుకునేలా చూసేందుకు మనం అప్రమత్తంగా వుండాల్సి వుంది.

ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించేందుకు, ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు అన్ని ప్రతిపక్షాలు ఒకే తాటిపైకి రావడం స్వాగతించాల్సిన అంశం. ఇతర ప్రతిపక్షాలతో సమన్వయం చేసుకోవడంలో, పౌరుల ఓటు హక్కును నియంత్రించే ప్రయత్నాలను ప్రతిఘటించడంలో సిపిఎం క్రియాశీల పాత్ర పోషిస్తుంది. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు తన పోరాటాన్ని కొనసాగిస్తుంది.

ప్రజా భద్రతపై మహారాష్ట్ర బిల్లు : బిజెపి ప్రభుత్వం ఆమోదించిన మహారాష్ట్ర ప్రజా భద్రతా బిల్లు ప్రజల ప్రజాస్వామిక హక్కులపై తీవ్రమైన దాడిని సూచిస్తోంది. 'తీవ్రవాద వామపక్ష శక్తుల'పై పోరాటం సాకుతో అసమ్మతిని ఎలుగెత్తి చాటే స్వరాలను ప్రజా భద్రతకు, జాతీయ భద్రతకు ముప్పుగా చూపించడానికి ఈ బిల్లు ప్రయత్నిస్తోంది. 'తీవ్రవాద వామపక్ష శక్తులు', ఇటువంటి సంస్థల నిర్వచనాలను ఉద్దేశ్యపూర్వకంగానే అస్పష్టంగా వదిలివేశారు. దీంతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకునే పరిధి మరింత విస్తృతమైంది. అసమ్మతిని అణచివేయడానికి, వ్యతిరేకత నోరు నొక్కివేయడానికి ఈ బిల్లులోని కఠినమైన నిబంధనలను దుర్వినియోగం చేసే తీవ్రమైన ప్రమాదం పొంచి వుంది.

ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులు : 30రోజుల పాటు కస్టడీలో వుంటే ప్రధాని, ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులను తొలగించాలంటూ మూడు బిల్లులను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇప్పటికే అమల్లో వున్న చట్టపరమైన పద్ధతులు, విధి విధానాలను పక్కకు నెట్టే ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణిని ఈ బిల్లులు ఎత్తిచూపుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ నయా ఫాసిస్ట్ ధోరణులను దృష్టిలో వుంచుకుంటే ఇలాంటి నిబంధ నలు ప్రతిపక్షాల నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలపై ఆయుధాలుగా ఉపయోగించేందుకు ఉద్దేశించ బడ్డాయి. ఈ చర్య ఏ ప్రజాస్వామ్యంలోనైనా అత్యంత కీలకమైనటువంటి పరస్పర నియంత్రణలు, సమతుల్య తల (చెక్స్ అండ్ బ్యాలన్సెస్) వ్యవస్థపై దాడి చేస్తోంది.

జమ్మూ కాశ్మీర్ : ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ పనితీరును లెఫ్టినెంట్ గవర్నర్ దెబ్బతీస్తున్నారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాన్ని పూర్తిగా పక్కకు నెట్టేస్తున్నారు. తన విధులను నిర్వర్తించడానికి అనుమతించడం లేదు. జమ్మూ కాశ్మీర్ ప్రజల ప్రజాస్వామ్య హక్కులను వ్యవస్థాగతంగా అణచివేస్తున్నారు. జమ్మూ, కాశ్మీర్, లడఖ్ మూడు ప్రాంతాల వ్యాప్తంగా ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తులు నెలకొన్నాయి. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించడమే ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడానికి గల ఏకైక మార్గం.

బెంగాలీల తరలింపు : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో బెంగాలీ మాట్లాడే ప్రజలను ముఖ్యంగా బెంగాలీ ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అనేక బిజెపి పాలిత రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. పత్రాలను సక్రమంగా పరిశీలించకుండా లేదా అనుసరించాల్సిన ప్రక్రియలేవీ అనుసరించకుండా బెంగాలీలను బంగ్లాదేశీయులుగా ముద్ర వేస్తున్నారు. అనేకమందిని పోలీసులు నిర్బంధించి, వారిపట్ల అమానవీయంగా వ్యవహరిస్తూ, వేధింపులకు పాల్పడు తున్నారు. భారత పౌరులతో సహా చాలామందిని బలవంతంగా సముద్ర, వైమానిక మార్గాల ద్వారా బంగ్లాదేశ్‌కు పంపివేసిన ఘటనలు కూడా వున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బెంగాలీ పౌరులపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలి. చాలాచోట్ల బెంగాలీలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను సిపిఎం జోక్యం చేసుకుని వ్యతిరేకించింది. భవిష్యత్తులో కూడా ఇది కొనసాగుతుంది.

అస్సాంలో బహిష్కరణలు : అస్సాం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద సంఖ్యలో ప్రజలను వారి స్వంత భూముల నుండి బహిష్కరిస్తోంది. మతోన్మాద పోకడలు పెచ్చరిల్లడం కోసం ముఖ్యమంత్రి ఈ బహిష్కరణలను ఉపయోగిస్తున్నారు. ఆయా భూముల్లో ఖనిజ వనరులు సుసంపన్నంగా వుండ డమే ఈ బహిష్కరణల వెనుక గల మరో ముఖ్యమైన ఉద్దేశ్యంగా వుంది. వాటిని దోచుకోవడానికి ప్రైవేటు కార్పొరేషన్లను అనుమతించాలని ప్రభుత్వం చాలా ఆతృతగా వుంది. ఈ అక్రమ బహిష్కరణలను ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలి.

మహిళలు, దళితులు, ఆదివాసీలపై దాడులు : దేశంలోని వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలు, దళితులు, ఆదివాసీలపై పెరుగుతున్న దాడులను కేంద్ర కమిటీ చర్చించింది. మహిళలు, దళితులు, ఆదివాసీలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న హింసకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పోరాటం ఉధృతమవుతుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఆర్.జి.కర్, కోల్‌కతా లా కాలేజీ సంఘటనల్లోని బాధితులకు, అలాగే కర్ణాటకలోని ధర్మస్థల బాధితులకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న పోరాటాలు, ఉద్యమాలకు కమిటీ మద్దతును ప్రకటించింది.

పార్లమెంట్ సమావేశాలు : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రతిపక్ష పార్టీల ఉధృత నిరసనలు, ఆందోళనలకు సాక్ష్యంగా నిలిచాయి. బీహార్‌లోని ఎస్ఐఆర్‌పై ఏ విధమైన చర్చకు కూడా ప్రభుత్వం అనుమతినివ్వడానికి నిరాకరించింది. ఈ నిరసనల మధ్యే, కేంద్ర ప్రభుత్వం అనేక బిల్లులను ఆమోదించేసింది. వీటిలో గనులు, ఖనిజాలు (అభివృద్ధి, క్రమబద్ధీకరణ) సవరణ బిల్లు, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాసే క్రీడా బిల్లులు సహా పలు బిల్లులు వున్నాయి.

దేశ కీలకమైన ఖనిజ వనరులను దోచుకునేం దుకు ప్రైవేటు, విదేశీ శక్తులను అనుమతించేలా తీసుకువచ్చిన సవరణ జాతీయ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోంది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్ కింద రక్షణ కల్పించబడిన గిరిజనుల భూములు వందలాది ఎకరాలను కూడా ప్రైవేటు కార్పొరేట్ దోపిడీకి అప్పగించేందుకు అనుమతించారు. దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం వుంది.

తీవ్రమైన అంశాలపై చర్చకు అనుమతించడానికి ప్రభుత్వం పదే పదే తిరస్కరించడం ఆ ప్రభుత్వ నియంతృత్వ స్వభావాన్ని తెలియచేస్తోంది. ఫలితంగా, ప్రజలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే అనేక అంశాలు పార్లమెంట్‌లో సక్రమ చర్చకు నోచుకోలేదు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ కూడా ప్రజల జీవనోపాధి సమస్యలను పార్లమెంట్‌లో చర్చించేలా పాత్ర పోషించాలి.

ఉప రాష్ట్రపతి ఎన్నిక : ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఆకస్మిక రాజీనామా నేపథ్యంలో జరిగిన ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా బ్లాక్, రిటైర్డ్ సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని తమ అభ్యర్థిగా పోటీకి నిలబెట్టింది. బిజెపి/ఆర్‌ఎస్‌ఎస్ హిందూత్వ మతోన్మాద భావజాలానికి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం వంటి రాజ్యాంగ సూత్రాల పై వారి దాడులకు వ్యతిరేకంగా చాలా బలమైన సందేశాన్ని ఈ పోటీ పంపింది. తాము పెట్టిన ఉప రాష్ట్రపతి అభ్యర్థికి తమ ఓట్లన్నీ పోలయ్యాయా లేదా అని ఇండియా బ్లాక్ పార్టీలు చూసుకోవాలి.

ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండించాలి : గాజాపై ఇజ్రాయిల్ నిరంతరంగా దాడులకు పాల్పడుతునే వుంది. మరోవైపు వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాడులు చేసేందుకు, వారి భూములను అక్రమించుకునేందుకు ఇజ్రాయిలీ సెటిలర్లకు స్వేచ్ఛను ఇచ్చింది. గాజాలోకి ప్రవేశించే అన్ని రకాల మానవతా సాయంపై నిషేధం విధించింది. దీంతో గాజాలో ఆకలి కేకలు పెచ్చరిల్లాయి. ఆహారం లేక చిన్నారులు, వృద్ధులు మరణిస్తున్న వార్తలు రోజూ కనిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో వార్తలను ఇచ్చే జర్నలిస్టులపై దాడులు కూడా ఉధృతమయ్యాయి. ఆస్పత్రులపై బాంబుల వర్షం కురుస్తోంది. మొత్తంగా గాజా నగరమంతా శిధిలాల కుప్పగా మారింది.

అంతర్జాతీయ చట్టాలను, దౌత్య ప్రమాణాలను, నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా ఇజ్రాయిల్, కాల్పుల విరమణ చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న ఖతార్‌పై దాడులకు పాల్పడింది. దీంతో మరోసారి పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి నెలకొనడాన్ని వ్యతిరేకించే ఒక దుష్ట దేశంగా ఇజ్రాయిల్ నిలిచింది. ఎటువంటి కాల్పుల విరమణ ప్రతిపాదనలను కూడా ఆమోదించకుండా వ్యతిరేకతను ప్రదర్శిస్తోంది. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం ఏకమై, చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ విద్వేష వ్యాఖ్యలు

ఢిల్లీలో ఎంపిక చేసిన కొద్దిమంది ఆహుతులతో జరిగిన మూడు రోజుల సమావేశాల్లో ఆర్‌ఎస్‌ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ ప్రసంగిస్తూ, మథుర, కాశీ వివాదాలను తిరిగి రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. సోదరభావంతో మెలగాలంటే అందుకు ముందస్తు షరతుగా ఈ రెండు ప్రాంతాల్లోని మసీదులను ముస్లింలు ఇచ్చి వేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి డిమాండ్లు మతోన్మాద విద్వేషాలను రెచ్చగొట్టడానికి, మత ప్రాతిపదికన సమాజాన్ని చీల్చడానికే ఉద్దేశించబడ్డాయి. భారత రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ నిర్లక్ష్యం చేస్తోందని ఈ దేశ చట్టాలను వారు ఉల్లంఘిస్తున్నారని భగవత్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయి. హిందూ రాష్ట్ర ఏర్పాటు దిశగా, సెక్యులర్ దేశాన్ని ధ్వంసం చేసే లక్ష్యంతో ముందుకు సాగాలన్న ఆర్‌ఎస్‌ఎస్ కృత నిశ్చయాన్ని ఈ వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయి.

నేపాల్‌లో సంక్షోభం

ఇటీవల నేపాల్‌ను కుదిపేసిన నిరసనలు, అక్కడ యువత ప్రధానంగా జనరేషన్ జడ్ పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనల్లో 70మంది మరణించడం పట్ల సిపిఎం విచారం వ్యక్తం చేసింది. వారికి సంతాపం తెలియచేసింది. ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడంతోనే ఒక్కసారిగా ఈ ఆందోళనలు తలెత్తినప్పటికీ ఏళ్ళ తరబడి ప్రజల్లో అసంతృప్తి కూడా బాగా పేరుకుపోయింది. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలను పరిష్కరించడంలో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు పదే పదే విఫలం కావడం, విశృంఖలమైన అవినీతి, ఉపాధి అవకాశాలు కొరవడడం ఇవన్నీ కూడా ప్రజల్లో అసహనానికి, అసంతృప్తికి కారణాలయ్యాయి.

మితవాద శక్తులు ముఖ్యంగా రాజరిక అనుకూల వాదులు, రాజవంశవాదులు, హిందూత్వ శక్తులతో సంబంధమున్న గ్రూపులు ఈ అసమ్మతి, అసంతృప్తిని అవకాశంగా తీసుకోవడానికి ప్రయత్నించాయి.

రాచరికానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పాటూ పోరాడి ఎంతో కష్టపడి సాధించుకున్న రాజ్యాంగాన్ని అందులో పొందుపరిచిన ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించుకోవడానికి జాగ్రత్త అవసరం.

కేంద్ర కమిటీ పిలుపు

1. సెప్టెంబరు చివరి వారంలో ట్రంప్ టారిఫ్ టెర్రిజానికి వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం చేపట్టాలి. అమెరికా ముందు తలొగ్గిన బిజెపి ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేయాలి.
2. దేశవ్యాప్తంగా విస్తృత కార్యకలాపాల ద్వారా పాలస్తీనా సంఘీభావ ప్రచారాన్ని నిర్వహించాలి. బిజెపి ప్రభుత్వం అనుసరించే ఇజ్రాయిల్ అనుకూల విధానాలను బహిర్గతం చేయడానికి అన్ని రాష్ట్రాల రాజధానుల్లో పెద్ద ఎత్తున బహిరంగ సభలు నిర్వహించాలి. వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు, కళాకారులు, వ్యక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలి.
3. ప్రజల జీవనోపాధులకు సంబంధించి సమస్యలపై అన్ని రాష్ట్రాల కమిటీలు ఆందోళనలు, పోరాటాలు చేపట్టాలి.

న్యూయార్క్ టైమ్స్‌పై ట్రంప్ కక్షసాధింపు

- ఫ్లోరిడాలో పరువు నష్టం దావా

వాషింగ్టన్ : అమెరికాకు చెందిన ప్రసిద్ధ వార్తా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్'పై ఆ దేశ అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారు. ఈ సంస్థపై ఫ్లోరిడా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల మేరకు పరువు నష్టం దావా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పత్రిక తనను ఎంతగానో దూషించిందని, అపవాదలు మోపిందని ఆయన పేర్కొన్నారు. 'అమెరికా అధ్యక్ష ఎన్నికలలో పోటీ చేసిన డెమొక్రాట్ కమలా హారిస్‌ను సమర్థిస్తూ న్యూయార్క్ టైమ్స్ తన మొదటి పేజీలో ఓ వార్తను ఒదించింది. అంతకుముందు ఎవరూ వినని విషయం. నన్ను, నా కుటుంబాన్ని, వ్యాపారాన్ని, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్‌ను, మాగాను...మొత్తంగా మన దేశాన్ని గురించి చాలా కాలంగా అబద్ధాలు చెబుతోంది' అని ట్రూత్ సోషల్ పోస్టులో ట్రంప్ రాసుకొచ్చారు. డెమొక్రాట్ పార్టీకి 'న్యూయార్క్ టైమ్స్' గొంతుకలా మారిందని విమర్శించారు. రిపబ్లికన్ల నేతృత్వంలో జరుగుతున్న ఉద్యమాలు, అమెరికా ఫస్ట్ మూవ్‌మెంట్, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) వంటి భావజాలాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తోందన్నారు. కాగా ట్రంప్ వ్యాఖ్యలపై న్యూయార్క్ టైమ్స్ నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.

దురాక్రమణ జోరు

గాజా సిటీ : ఆకలి కేకలతో అలమటిస్తూ..వైద్య కోసం అఘోరిస్తూ సహాయక శిబిరాల్లో, వైద్య శిబిరాల్లో వేచి చూస్తున్న అమాయక పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ దుర్మార్గపు దాడులు కొనసాగుతూనేవున్నాయి. గాజా సిటిపై వైమానిక దాడులతో విరుచుకుపడుతూనే పదాది దళాల భారీ మోహరింపుతో గాజా సిటీ భూభాగంలో దురాక్రమణ చర్యలను కూడా ఇజ్రాయిల్ జోరుగా కొనసాగిస్తోంది. క్రమం క్రమంగా గాజాను తన కబంధ హస్తాల్లో బంధించుకునేందుకు చొచ్చుకువెళ్తోంది. ఈ క్రమంలో ప్రజలపై అమానవీయ దాడులు చేస్తోంది. గత సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం వరకు జరిగిన ఈ దాడుల్లో 78 మంది చనిపోయారు.

వీరిలో అత్యధికులు మహిళలు, చిన్నారులే కావడం ఆందోళనకరం. ఇజ్రాయిల్ అవలంబిస్తున్న దుర్మార్గమైన సైనిక వ్యూహాల కారణంగా..ఇక గాజాలో మానవ మనుగడ అసాధ్యంగా కనిపిస్తోంది. ఎక్కడివక్కడే వదిలేసి బతుకు జీవుడా అంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లకతప్పడం లేదు.

ఇజ్రాయిల్‌ను ఎదుర్కోవడానికి ఉమ్మడి రక్షణ వ్యవస్థ

- అరబ్, ఇస్లామిక్ దేశాధినేతల నిర్ణయం
- అమానవీయ దాడులపై ఆగ్రహం

దోహా (ఖతార్) : పాలస్తీనాలోని గాజాలో అమానవీయ దాడులకు తెగబడుతున్న ఇజ్రాయిల్‌ను తిప్పికొట్టేందుకు ఉమ్మడి రక్షణ వ్యవస్థను పునరుద్ధరించాలని అరబ్, ఇస్లామిక్ దేశాలు నిర్ణయించాయి. ఖతార్ రాజధాని దోహాలో ఆయా దేశాల నేతలతో ఏర్పడిన గల్ఫ్ సహకార మండలి (జిసిసి) దోహాలో సమావేశమైంది. ఉమ్మడి రక్షణ వ్యవస్థను తిరిగి క్రియాశీలకం చేయాలని నిర్ణయించింది. దోహాలో హమస్ నేతలపై ఇజ్రాయిల్ జరిపిన దాడులు నమ్మకద్రోహంతో కూడిన పిరికిపంద చర్య అని ఖతార్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి జిసిసి భాగస్వామ్య దేశాలైన బహ్‌రైన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) దేశాధినేతలు, ప్రతినిధులు హాజరయ్యాయి. సభ్య దేశాలు భద్రతా పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిసిసి ఓ రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఈ సమావేశం ప్రారంభోత్సవం సందర్భంగా షేక్ తమిమ్ మాట్లాడుతూ 'మా దేశ రాజధానిలో హమాస్ నేతల కుటుంబాలు, ఆ నేతల చర్చల ప్రతినిధి బృందం నివసిస్తున్న ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని నమ్మకద్రోహంతో దాడి చేశారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాజాలో కాల్పుల విరమణ పాటించే విషయంపై అమెరికా చేసిన తాజా ప్రతిపాదనపై చర్చించడానికి హమాస్ నేతలు దోహాలో సమావేశమవ్వగా..వారిని లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ వైమానిక దాడి జరిపిన సంగతి తెలిసిందే. ఈ నెల 9న జరిగిన ఆ దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయిల్ ప్రభుత్వ అధికార వ్యామోహం, అహంకారం, రక్తపిపాసను నిలువరించడానికి ధృఢమైన చర్యలు తీసుకోవాల్సిందేనని తమిమ్ పిలుపునిచ్చారు. మధ్యవర్తులపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని చూస్తుంటే దానికి శాంతి స్థాపనపై నిజంగా ఆసక్తి లేదని స్పష్టమవుతోందన్నారు. గాజాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న చర్చలను అడ్డుకోవాలన్నదే దాని తాపత్రయంగా కనిపిస్తోందని చెప్పారు. ఇజ్రాయిల్ ఈ ప్రాంతంలో తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే లెబనాన్, సిరియా, ఎమన్‌పై బాంబు దాడులు చేస్తోందని ఖతార్ ఎమిర్ తమిమ్ పేర్కొన్నారు. సిరియా భూభాగాన్ని కూడా ఇజ్రాయిల్ ఆక్రమించుకున్నదని, దక్షిణ లెబనాన్ నుంచి తన దళాలను ఉపసంహరించుకునేందుకు నిరాకరిస్తోందని ఆయన చెప్పారు. గల్ఫ్ దేశాలు తమ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించాయని, త్వరలోనే దోహాలో యూనిఫైడ్ మిలిటరీ కమాండ్ సమావేశం జరుగుతుందని ఖతార్ విదేశాంగ ప్రతినిధి మహమ్మద్ అల్-అన్సారీ తెలిపారు.

జిసిసి ప్రధానకార్యదర్శి జసేమ్ మహమ్మద్ అల్‌బుదైవీ మాట్లాడుతూ అమెరికా తన సన్నిహిత భాగస్వామి ఇజ్రాయిల్‌ను అదుపులో ఉంచుకోవాలని హెచ్చరించారు. ఖతార్‌పై మరోసారి దాడి చేస్తామంటూ ఇజ్రాయిల్ చేస్తున్న బెదిరింపులను జిసిసి సభ్య దేశాలు ఖండించాయి. ఇజ్రాయిల్ కనుక అలాంటి చర్యకు పూనుకుంటే అంతర్జాతీయ సమాజం ముందు దానిని దోషిగా నిలబెడతామని తెలిపాయి. ఇజ్రాయిల్‌పై ఆర్థిక ఒత్తిళ్లు సహా మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, యుద్ధ నేరాలకు గాను ఆ దేశానికి చెందిన ఉన్నతాధికారులను చట్టం ముందు నిలబెట్టాలని టర్కీ అధ్యక్షులు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపారు. ఖతార్‌పై ఇజ్రాయిల్ చేసిన దాడి కచ్చితంగా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని ఈజిప్ట్ అధ్యక్షులు అబ్దెల్ ఫతా ఎల్-సిసి విమర్శించారు. అమానీయ దాడలతో, యుద్ధ నేరాలతో బరితెగిస్తున్న ఇజ్రాయిల్‌ను ఐక్యరాజ్యసమితి నుంచి సస్పెండ్ చేయాలని పాకిస్తాన్ విజ్ఞప్తి చేసింది. అరబ్-ఇస్లామిక్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని కోరింది.

నిర్మాణ కార్మికులకు డబుల్ ఇంజిన్ సర్కార్ ద్రోహం

- గుజరాత్‌లో సెస్ మొత్తం దారిమళ్లింపు • సంక్షోభంలో సంక్షేమం

అహ్మదాబాద్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రహదారులు, వంతెనలు వంటి మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణ పనుల్లో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ అభివృద్ధికి దోహదం చేస్తున్న కష్టజీవులను అక్కడి బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నిలువునా వంచనకు గురి చేస్తోంది. 2006 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ ప్రాజెక్టుల నుంచి సుమారు రూ.4,786.60 కోట్లను సెస్సు రూపంలో వసూలు చేసినప్పటికీ .. ఆ మొత్తాన్ని కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయకుండా దారి మళ్లించి మోసగించింది. ఈ విషయాన్ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తన నివేదికల్లో ఎత్తిచూపింది. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన కీలక బోర్డు పనిచేయడం లేదని, వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించింది. కార్మికుల సంక్షేమం కోసం కేటాయించిన నిధులలో 47 శాతం వివిధ ప్రభుత్వ ఖాతాలలో మూలుగుతున్నాయని పేర్కొంది. నిర్మాణ కార్మికుల ప్రయోజనాలకు సంబంధించి 1996 తీసుకొచ్చిన చట్టం ప్రకారం..ప్రభుత్వం విధిగా సంక్షేమ బోర్డును, సలహా కమిటీని, సంక్షేమ నిధిని నిర్వహించాలి. కానీ ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఆ వ్యవస్థ మొత్తాన్ని నిర్వీర్యమైపోయింది. దీంతో లక్షలాది మంది కార్మికుల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

వరద బాధితుల పరామర్శకు వెళ్లిన రాహుల్‌కు అడ్డంకులు

- వీడియో వైరల్

చండీగఢ్ : పంజాబ్‌లోని రావి నది సమీపంలో వరద ప్రభావిత గ్రామాన్ని సందర్శించేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు ఇటీవల అడ్డుకున్నారు. ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమృతసర్, గురుదాస్‌పూర్ జిల్లాలలో వరద బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం భారత్-పాకిస్తాన్ సరిహద్దులోని తూర్ గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే రావి నదిని దాటకుండా ఆయనను పోలీసు అధికారులు నిలువరించారు. దీనిపై రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఆయన ఆ గ్రామం వైపు చూపిస్తూ 'భారత భూభాగంలో నన్ను క్షేమంగా ఉంచలేమని మీరు చెబుతున్నారా? ఇది భారతదేశం కాదా?' అని పోలీసు ఉన్నతాధికారిని రాహుల్ నిలదీశారు.

మతమార్పిళ్లు 'మోసపూరితం' అని తేల్చేదెవరు..?

- సుప్రీంకోర్టు సూటి ప్రశ్న
- పలు రాష్ట్రాలకు నోటీసులు

న్యూఢిల్లీ : మత మార్పిళ్లు 'మోసపూరితమైనవి' అని కచ్చితంగా నిర్ధాంచి చెప్పగలిగే వారెవ్వరని ఇందుకు సంబంధించి పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ్‌ని సుప్రీంకోర్టు నిలదీసింది. దీనిపై తమ వివరణ తెలియాలని నాలుగు వారాల గడవునిస్తూ సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా మోసపూరిత మతమార్పిళ్లపై సంపూర్ణ నిషేదం విధించాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో మత మార్పిళ్లకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, న్యాయమూర్తి కె వినోద్ చంద్ర నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. 'మోసపూరిత మత మార్పిళ్ల'ను నిర్ధారించేవారెవ్వరని న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ్‌ని ప్రశ్నించింది. ఒకవేళ రెండు విశ్వాసాలకు చెందిన జంట..మతాంతర వివాహం చేసుకుంటే అది మోసపూరితమైన మత మార్పిడిగా నిర్ధాంచేవారెవ్వరని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించారు. మత మార్పిళ్ల చట్టాల చెల్లుబాటును ప్రశ్నించిన ఒక ఎన్‌జిఒ తరపు సీనియర్ న్యాయవాది సిపి సింగ్ వాదనలతో ఈ సందర్భంగా జస్టిస్ బిఆర్ గవాయ్ ఏకీభవించారు. న్యాయస్థానం చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలిస్తుందే కానీ, చట్టాలను రూపొందించడానికి కాదని స్పష్టం చేశారు. దీంతో వెనక్కి తగ్గిన న్యాయవాది అశ్వనీ ఉపాధ్యాయ్ తాను తన పిటిషన్‌ను కేవలం ప్రలోభాలకు గురి చేయడం, నకిలీ మత మార్పిళ్లకు వ్యతిరేకంగానే దాఖలు చేసినట్లు తెలిపారు. రాజ్యాంగంలోని అధికరణ 25 ప్రకారం..ప్రజలందరికీ మతాన్ని ప్రచారం చేసుకునే హక్కు ఉందని, కానీ మోసం లేదా బలవతంగా మతం మార్చరాదని ఆయన చెప్పారు. ఈ సందర్భంలో జోక్యం చేసుకున్న జస్టిస్ బిఆర్ గవాయ్ మత మార్పిడి మోసపూరితమైనదా? కాదా? అని ఎవరు నిర్ధారిస్తారు అని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్, న్యాయవాది వృందా గ్రోవర్‌తో కలిసి హాజరైన సిపి సింగ్ వాదనలు వినిపిస్తూ..ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక తదితర రాష్ట్రాలు ఒకదాని తర్వాత ఒకటి మక్కికి మక్కి పద్ధతిలో మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా 'మత స్వేచ్ఛ' పేరిట చట్టాలను తీసుకొచ్చాయని, వాస్తవానికి ఆ చట్టాలల్లో 'స్వేచ్ఛ' అనేది లేదని పేర్కొన్నారు. ఇటీవల ఇదే తరహాలో రాజస్థాన్ కూడా ఒక చట్టాన్ని తీసుకొస్తోందని తెలిపారు. మోసపూరిత మత మార్పిళ్లకు వ్యతిరేకంగా ఆ చట్టాలు తీసుకురావడం లేదని, మత మార్పిళ్లను అడ్డుకోవడమే వాటి లక్ష్యమని పేర్కొన్నారు. మతాంతర వివాహాలు చేసుకున్న వారిని వేధించడానికి, మతపరమైన ఆచారాలను కట్టడి చేయడానికే ఈ చట్టాలను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాల్సిందిగా అత్యున్నత న్యాయస్థానం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కర్నాటక తదితర రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్రాల నుంచి స్పందన వచ్చిన తర్వాత చట్టాల అమలుపై స్టే విధించాలా వద్దా అనే విషయాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది. సమగ్ర వాదనలు వినిపించేందుకు వీలుగా పిటిషనర్లకు, ప్రతివాదులైన రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తగినంత సమయం ఇచ్చింది. జమైత్ ఉలేమా-ఈ-హింద్, సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ సహా పలు సంస్థలు మత మార్పిడి నిరోధక చట్టాలను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేశాయి.

జీవన సౌరభం

సాధ్యం కాదు అనుకుంటే ఏ పనీ చేతకాదు. ప్రయత్నించి చూడాలి. గెలిస్తే సంతోషం, ఓడితే అనుభవం వస్తాయి.

మీ కోసం

ఎక్కిళ్లు ఆగకుండా వస్తుంటే కొంచెం పంచదార నోట్లో వేసుకుంటే తగ్గిపోతాయి.

మూగ జీవులపై ప్రేమ

టింకూకి చిన్నప్పటి నుండి అమ్మ వెనక తిరగటం బాగా అలవాటు. అమ్మ వంట చేస్తుంటే, 'నేనూ కూర కలుపుతా' అని పేచీ పెట్టేవాడు. అమ్మ కూర తరుగుతుంటే కూరలు అందించేవాడు. అలా అమ్మకి అన్ని పనుల్లో సాయంగా ఉంటాడు. మొక్కలకు నీళ్ల పోయడం టింకూకి భలే సరదాగా ఉండేది. అవి పూలు పూసినా, కాయలు కాసినా, తెగ సంబరపడిపోయేవాడు. పొరపాటున చిన్న కొమ్మ విరిగినా, మొక్కలు చచ్చిపోయినా వెక్కెక్కి ఏడ్చేవాడు.

టింకూకి వాళ్ళింట్లో పెంచుకుంటున్న కుక్క టామీ అన్నా, చాలా ఇష్టం. దానికి రోజూ ఆహారం పెట్టేవాడు. టామీకే కాదు, ఇంటి ముందుకు ఆవులు వచ్చినా, పిల్లులు కనిపించినా, వాటికి కూడా ఆహారం పెట్టేవాడు. టింకూ పెద్దయ్యే కొద్దీ వాటితో అనుబంధం పెరుగుతూ వచ్చింది. అమ్మా నాన్న కూడా టింకూ మంచి మనసుని, మూగ జీవుల పట్ల చూపించే ప్రేమను చూసి, చాలా సంతోషించేవారు.

ఓ రోజు సాయంత్రం టింకు స్కూల్ నుండి రాగానే బ్యాగ్ కుర్చీలో పడేసి పెరట్లోకి పరుగెత్తాడు. టామీ కూడా టింకూని అనుసరించింది. వాటర్ ట్యూబ్‌తో మొక్కలకు నీళ్ల పోస్తూ, మధ్య మధ్యలో టామీతో టింకూ కబుర్లు చెబుతున్నాడు. అప్పుడు ఎక్కడినుంచో దారితప్పి వచ్చి, మొక్కల్లో దాక్కున్న పాము పిల్ల ఒకటి, నీళ్ల పడేసరికి బయటకు వచ్చింది. ఎదురుగా కనపడిన టింకూ దగ్గరికి రాబోయింది. అది గమనించిన టామీ, వెంటనే టింకుకీ అడ్డంగా నిలబడింది. పెద్దగా అరవ సాగింది. అప్పుడే పెరట్లోకి వచ్చిన అమ్మ, ఇదంతా చూసి, టింకూని పక్కకి లాగింది. పాములు పట్టే మనిషి వచ్చి, ఆ పాముపిల్లని పట్టుకుని దూరంగా వదిలేసి వచ్చాడు. 'మూగ జీవులపై టింకూ చూపించే ప్రేమే, ఈరోజు తనని కాపాడింది' అని ఇరుగుపొరుగు అంటుంటే టింకూ అమ్మానాన్న టామీ వైపు ప్రేమగా చూశారు.

– శశి, అజ్జమూరు.



దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో బయట ఉన్న పురుగు, ఆకు దగ్గరకు చేరుకోవాలి. కొంచెం దారి చూపించరూ?

నేను గీసిన బొమ్మ

కె.అఖిల్, 7వ తరగతి, ఎం.పి.పి.ఎస్, పి.నైనవరం, ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మీ సబ్బులో ఏముందో తెలుసా!

సబ్బు.. మనం ప్రతిరోజు వాడే నిత్యావసరాల్లో ఒకటి. చర్మంపై ఏర్పడిన మురికిని తొలగించే సాధనంగా మొదట దీన్ని వినియోగించినా రాను రాను దీని ప్రాధాన్యత కొత్త రూపాల్లోకి మారింది. సౌందర్యానికి, ఆరోగ్యానికి అంటూ రకరకాల పేర్లతో మార్కెట్లో ఎన్నో ఉత్పత్తులు కనిపిస్తాయి. అయితే ఈ సబ్బుల్లో ఏయే మూలకాలు ఉన్నాయో తెలుసుకోకుండా వాడితే ఆరోగ్యానికి మేలు కంటే హాని కలిగిస్తాయి అంటున్నారు నిపుణులు.

సబ్బు గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే చరిత్రలోకి వెళ్లాలి. క్రీ.పూ. 2800 నాటి బాబిలోనియన్లు జంతువుల కొవ్వు, కలప బూడిదతో సబ్బును తయారు చేశారు. దీనిని ఎక్కువగా బట్టలు ఉతకడానికి ఉపయోగించారు. ఆ తర్వాత క్రీ.పూ. 1500 నాటికి ఈజిప్షియన్లు చర్మ సంరక్షణ కోసం నూనెలు, ఉప్పుతో సబ్బును శుద్ధి చేశారు. ఆ తర్వాత యూరోపియన్లు స్నానం కోసం ఆలివ్ ఆయిల్‌తో సువాసన గల సబ్బులను తయారు చేశారు. ఇలా సబ్బు మనిషి అవసరాలకి తగ్గట్టుగా మారుస్తూ వచ్చారు.

సబ్బులో ఉండే పదార్థాలు.. ఫలితాలు..

ప్రస్తుతం మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా లభించే సబ్బుల్లో హానికరమైన రసాయనాలు ఉంటున్నాయి.

- సోడియం లారిల్ సల్ఫేట్, సోడియం లారెత్ సల్ఫేట్ ఉన్న సబ్బు మంచి నురుగుని ఇస్తాయి. కానీ, చర్మం నుండి సహజ నూనెలను తొలగించి, చర్మం పొడిగా మారడానికి, చికాకుకు కారణమవు తాయి.
- పారాబెన్స్ అనే కెమికల్ ఉండడం వల్ల థైరాయిడ్ హార్మోన్లను దెబ్బతీసి ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి.
- ట్రైక్లోసన్ అనే రసాయనం ఉండడం వల్ల.. చర్మంపై ఏర్పడ్డ బ్యాక్టీరియాను చంపుతుంది. కానీ, హార్మోన్ల అసమతుల్యత, పర్యావరణానికి చేటు తెస్తుంది.

ఎలాంటివి వాడాలి?

సబ్బుల వల్ల ఆరోగ్యం పాడవ్వకుండా ఉండాలంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

- కొబ్బరి నూనె, షియా బటర్, కలబంద, తేనె వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన సబ్బులను ఎంచుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ఈ పదార్థాలు చర్మానికి, ఆరోగ్యానికి హాని చేయకుండా శుభ్ర పరుస్తాయి.

గొంతు నొప్పి వేధిస్తుందా?

వర్షాకాలంలో ప్రధానంగా వేధించే సమస్యలలో జలబు, దగ్గు ముఖ్యమైనవి. వీటితో పాటు గొంతు నొప్పి కూడా చాలా మందిని వేధిస్తూ ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండటమే గొంతు నొప్పికి కారణం. చాలా మందికి ఉదయం లేచే సరికి గొంతు పట్టేస్తూ ఉంటుంది. మరికొంతమందికి గొంతునొప్పి రోజులు తరబడి వేధిస్తూ ఉంటుంది. కొన్ని రకాల కషాయాలను తాగడం ద్వారా ఈ నొప్పిని తగ్గించుకోవచ్చు.

అల్లం కషాయం : దీనిని తయారు చేయడానికి ముందుగా వేడి నీటిలో అల్లం వేసి ఉడికించాలి. తరువాత ఆ నీటిని ఓ గుడ్డలో వేసి వడకట్టాలి. తరువాత ఆ నీటిలో కొంచెం తేనే వేసుకొని తాగాలి. అల్లంలో ఇన్ఫెక్షన్లను పోగొట్టే లక్షణాలు ఉంటాయి. అందుకే దీనిని తీసుకుంటే గొంతు నొప్పి తగ్గుతుంది. లేదా అల్లం టీ లాంటివి తాగినా మంచి ప్రయోజనం ఉంటుంది.

తులసి, మిరియాల కషాయం : కొన్ని తులసి ఆకులు, మిరియాలు కలిపి నీటిలో ఉడికించాలి. తరువాత వాటిని వడకట్టి ఆ నీటిని తాగాలి. ఇలా చేయడం వల్ల గొంతు నొప్పి త్వరగా తగ్గే అవకాశం ఉంది.

మిరియాలు, బాదం కషాయం : నల్ల మిరియాలను, బాదం పప్పులను కలిపి పొడి చేసుకోవాలి. దాన్లో కొంచెం నెయ్యి కలిపి తీసుకోవాలి. ఇలా చేస్తే గొంతు నొప్పి త్వరగా తగ్గుతుంది. నల్ల మిరియాల పొడిని నీటిలో వేసుకొని తాగినా తొందరగా గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

గోరు వెచ్చని నీరు : గొంతునొప్పి వచ్చినప్పుడు గోరు వెచ్చని నీటిని మాత్రమే తాగాలి. కూల్ డ్రింక్స్, చల్లని పానీయాలు, చల్లని నీటిని తాగడం ఆపేయాలి. వీలైనంత వరకు వేడిగా ఉండే పదార్థాలనే తీసుకోవాలి.

వాము నీరు.. రోజూ తాగండి

వాము ఆరోగ్యానికి ఎంతో మంచిది. అనేక రకాల అనారోగ్యాలను దూరం చేస్తుంది. వామును నేరుగా లేదా నీటిలో మరిగించి తీసుకోవడం మంచిది. వామును ప్రతిరోజూ తీసుకోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తొలగిపోతాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.

- వాములో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బాక్టీరియల్ వంటి మంచి లక్షణాలున్నాయి. ఇందులో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, నికోటినిక్ యాసిడ్, కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి.
- రోజూ ఉదయం ఖాళీ కడుపుతో అరచెంచా వాము తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. కడుపు నొప్పి సమస్య ఉండదు.
- చాలామంది మహిళలు పీరియడ్స్ సమయంలో పొత్తికడుపులో భరించలేని నొప్పిని అనుభవిస్తుంటారు. అలాంటి సమయంలో నీటిలో వామును మరగబెట్టి, చల్లారిన తర్వాత ఆ నీటిని తీసుకోవడం వల్ల కడుపు నొప్పి సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.
- వామును బుగ్గన పెట్టుకుని నమిలి చప్పరిస్తూ రసాన్ని మింగితే గొంతునొప్పి, గొంతులో గరగర శబ్దాలు తగ్గుతాయి. నోటి నుండి దుర్వాసన వస్తుంటే వాము నీరు తాగితే సమస్య తగ్గుతుంది.
- ఆస్తమా వ్యాధిగ్రస్తులు వాము, బెల్లం కలిపి తీసుకుంటే మంచిది. కొద్దిగా వాము నోట్లో వేసుకొని వేడి నీటితో కలిపి నములుతూ ఉంటే చలికాలం వచ్చే జలుబు, దగ్గు తగ్గుతాయి.
- బరువు తగ్గించుకోవడానికి వాము నీరు ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని జీవక్రియలను సరిచేయడం ద్వారా ఊబకాయాన్ని నియంత్రిస్తుంది. అందువల్ల ప్రతిరోజూ ఖాళీ కడుపుతో వాము నీటిని తీసుకోవాలి.
- జలుబు, మైగ్రెయిన్ తలనొప్పికి ఇది మంచి మందు. వాము పొడిని ఒక గుడ్డలో కట్టి మెల్లగా వాసన చూస్తే సమస్య తీరిపోతుంది. వామును నీళ్లలో నానబెట్టి అందులో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి.

వామునీరు తయారీ : ఒక చెంచా వాము గింజలను ఒక గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టాలి. ఉదయం ఆ నీటిని బాగా మరిగించి వడపోసి, ఖాళీ కడుపుతో తాగాలి. రోజూ ఇలా చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

పీఎం విశ్వకర్మ | భారత ప్రభుత్వం | NATIONAL SC-ST HUB Safalta ki pehchaan
సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ

"ప్రధాని విశ్వకర్మ దేశం నలుమూలల నుండి వచ్చిన చేతివృత్తులవారు మరియు చేతివృత్తులవారి నైపుణ్యాలను పెంపొందించడమే కాకుండా, వారు తయారు చేసిన ఉత్పత్తులకు ప్రపంచంలో కొత్త గుర్తింపు లభిస్తుంది."

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
సేవ అనేది సంకల్పం, భారతదేశం మొదట ప్రేరణ....75 సంవత్సరాలు

పీఎం విశ్వకర్మ
మరియు
ఎస్సీ-ఎస్టీ హబ్
మెగా కన్‌క్లేవ్, 2025
అధ్యక్షత వహించువారు

శ్రీ జితన్ రామ్ మంజీ
కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రి

సుశ్రీ శోభా కరంద్లజే
సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల సహాయ మంత్రి

ప్రధాని విశ్వకర్మ రెండేళ్ల వేడుకలు జరుపుకుంటున్నారు

పీఎం విశ్వకర్మ
- 30 లక్షల మంది విశ్వకర్మలు విజయవంతంగా నమోదు చేసుకున్నారు
- 23 లక్షల మంది విశ్వకర్మలు నైపుణ్య శిక్షణ పొందారు
- 5 లక్షల మంది విశ్వకర్మలకు రూ.4,166 కోట్ల విలువైన రుణం ఆమోదించబడింది
- 8 లక్షల టూల్ కిట్ల పంపిణీ

జాతీయ ఎస్‌సి-ఎస్టీ హబ్ పథకం
- 1.5 లక్షలకు పైగా ఎస్సీ/ఎస్టీ లబ్ది పొందారు
- ఎస్సీ/ఎస్టీ యూనిట్ల నుండి ప్రభుత్వ సేకరణలో కాలానుగుణ పెరుగుదల

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (PMEGP)
- 10 లక్షల యూనిట్లకు రూ.28,333 కోట్ల విలువైన సబ్సిడీ లభించింది
- 86 లక్షల ఉపాధి కల్పన జరిగింది.

CBC 25113/15/0030/2526

సమ్మాన్ సమర్థ సమృద్ధి 17 సెప్టెంబర్ 2025 ఉ.10:10 గం.లకు ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, బోధగయ, బీహార్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68